

## నేడే 'ఆంధ్రజ్యోతి' ముగ్గుల పోటీ


కళాశాలకు బయలుదేరి.. అంతలోనే కన్నుమూసి

ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొని విద్యార్థి మృతి, మరొకరికి తీవ్రగాయాలు

హైవేపై లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా..

బైక్ హ్యాండిల్ లారీకి తగిలి యువకుడి మృతి.. మరో యువకుడికి గాయాలు

సరదాగా ఈతకు దిగి యువకుడి గల్లంతు 7




## సముద్రంలో అలవోకగా..

**వైజాగ్ నుంచి కాకినాడకు 150 కిలోమీటర్లు మహిళా స్విమ్మర్ ఈత**

సర్పవరం జంక్షన్ (కాకినాడ) జనవరి 3(ఆంధ్రజ్యోతి): కేవలం ఆరు రోజుల్లో రోజుకు 20-30 కిలోమీటర్లు వైజాగ్ నుంచి కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు బంగాళాఖాతంలో ఈతకొట్టి, సముద్రంలో 150 కిలోమీటర్ల లక్ష్యాన్ని అవలీలగా ఈదేసి కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన 52 ఏళ్ల మహిళా స్విమ్మర్ గోలి శ్యామల అరుదైన రికార్డును సొంతంచేసుకున్నారు. డిసెంబరు 28న విశాఖ ఆర్కే బీచ్‌లో ఎంపీ భరత్ సముద్రంలో ఈ యాత్రకు జెండా ఊపి ప్రారంభించగా, శుక్రవారం జనవరి 3న కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు ఈదుకుంటూ లక్ష్యాన్ని చేరుకున్నారు. సుదీర్ఘ సముద్రంలో 150 కిలోమీటర్లు ఈత ఈదిన తొలి ఆసియా స్విమ్మర్‌గా శ్యామల అరుదైన రికార్డు సాధించారు. 6

## నేటి నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు

**జిల్లా కలెక్టర్ ప్రశాంతి వెల్లడి**

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 15 ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈనెల 4వ తేదీ శనివారం నుంచి మధ్యాహ్న భోజన పథకం ప్రారంభిస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి వెల్లడించారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ జిల్లా మంత్రి దుర్గేష్, ఇతర శాసనసభ్యులు ఆయా నియోజకవర్గాల్లో ఈ పథకాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకుంటున్న 5,425 మంది విద్యార్థినీవిద్యార్థులకు ఈ మధ్యాహ్న భోజన పథకం అమలుచేయడం జరుగుతుందని, ఈమేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.

## సవాళ్లు అధిగమించి ఉత్తమ ఫలితాలు సాధించాలి

**హాస్టల్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన కలెక్టర్**

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి3 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థినీవిద్యార్థులు లక్ష్యాల సాధనలో సవాళ్లను అధిగమించి ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆకాంక్షించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా అభినందనలు తెలిపేందుకు వచ్చినవారు అందజేసిన పుస్తకాలను జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు 322 సెట్లను అందజేశామని తెలిపారు. కొత్త సంవత్సరంలో ఒక మంచి కార్యక్రమంలో భాగస్వాములు కావడం ద్వారా ప్రతి ఒక్కరూ తమ వంతుగా సామాజిక బాధ్యత చూపాలని పేర్కొన్నారు. కాగా కలెక్టర్ ఆదేశాలమేరకు వసతిగృహాల్లోని పిల్లలకు 322 సెట్స్‌తో పాటు కలెక్టర్ పంపిన సందేశాన్ని, శుభాకాంక్షలను అందజేశామని జిల్లా సాంఘిక సంక్షేమాధికారి సందీప్ తెలిపారు.



సీఎం చంద్రబాబుతో భేటీ అయిన మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల, ఆదిరెడ్డి, బత్తుల

# బాబుతో భేటీ!

- పేపరుమిల్లు కార్మికులకు అన్యాయం జరగనివ్వను
- ఎంపీ, ఎమ్మెల్యేల బృందానికి సీఎం చంద్రబాబు స్పష్టీకరణ
- ఉన్నత స్థాయి కమిటీ నియమించాలని అడిషనల్ సెక్రటరీకి సీఎం ఆదేశం
- సీఎంతో భేటీ అయిన మంత్రి కందుల, ఎంపీ పురందేశ్వరి
- సీఎంను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు గోరంట్ల, ఆదిరెడ్డి, బత్తుల
- పేపరుమిల్లు కార్మిక వర్గాల్లో ఆనందం

రాజమహేంద్రవరం/అర్బన్,జనవరి3 (ఆంధ్రజ్యోతి): కొద్దికాలంగా వివాదాస్పదంగా మారిన రాజమండ్రి పేపరుమిల్లు సమస్యలను చక్కదిద్దే పనిలో కూటమి ప్రజాప్రతినిధులు నిమగ్నమయ్యారు. ప్రధానంగా కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఇక్కడ ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవడమేగాకుండా నేరుగా ముఖ్యమంత్రితోనే భేటీ అయ్యారు. కార్మికులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రాజమండ్రి పేపరుమిల్లు కార్మికులకు అన్యాయం జరగనీయను.. వారికి న్యాయం చేస్తామని స్పష్టంచేశారు. అంతేకాదు ఈ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీని నియమించాలని తక్షణం అడిషనల్ సెక్రటరీని ఆదేశించారు. జీతాలు పెంచకపోవడం, కార్మికులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యల గురించి రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ శుక్రవారం అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడితో భేటీ అయ్యారు. పేపరు మిల్లులో చాలా కాలంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను, యాజమాన్య వైఖరిని వారు సీఎంకు వివరించారు. సమస్య ఎందుకు వచ్చిందని, ఇప్పటి వరకూ ఎన్నిసార్లు వేతన అగ్రిమెంట్లు జరిగాయని చంద్రబాబు వారిని అడిగారు. వైసీపీ హయాంలో వేతన ఒప్పందం మీద జాప్యం జరిగిందని, గతంలో జేసీఎల్ సమక్షంలో ప్రజాప్రతినిధుల సమక్షంలో వేతన ఒప్పందం మీద చర్చలు జరిగాయని వారు చెప్పారు. ముఖ్యంగా గత డిసెంబరు 24న జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సమక్షంలో జరిగిన సమావేశంలో రూ.3,500 మించి జీతం పెంచడం తమ చేతుల్లో లేదని పేపర్ మిల్లు మేనేజ్‌మెంట్ తేల్చేసిన విషయాన్ని కూడా వారు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకుని వెళ్లారు. కానీ గతంలో చేసిన ఒప్పందంలో పేపరు మిల్లు కార్మి కులకు రూ.9 వేలు పెరిగిందని సీఎం చంద్రబాబుకు వారు వివరిస్తూ, ఈసారి కూడా కార్మికులకు న్యాయం చేయవలసి ఉందని వారు సీఎంకు వివరించారు. దీనిపై చంద్రబాబు పేపరుమిల్లు యాజమాన్యం తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కార్మికులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనీయమని, న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. సమస్య పరిష్కారం కోసం ఉన్నత స్థాయి కమిటీని నియమించాలని అడిషనల్ సెక్రటరీ కార్తికేయ మిశ్రాను సీఎం చంద్రబాబు నాయుడు అక్కడికక్కడే ఆదేశించారు. ఈ నేపథ్యంలో పేపరు కార్మిక వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. తమ సమస్య పరిష్కారానికి జిల్లా ప్రజాప్రతినిధులు వీరు చేస్తున్న కృషికి, సీఎం చంద్రబాబు స్పందన పట్ల కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. కొద్ది రోజుల్లోనే తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశాభావంతో ఉన్నారు.



**సిద్ధమైన శ్రీ షిర్డీ సాయి విద్యానికేతన్ గ్రౌండ్**

రాజమహేంద్రవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీ శనివారం జరుగనుంది. ప్రతి ఏటా సంక్రాంతికి ముత్యాల ముగ్గుల పండుగను ఘనంగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది కూడా ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పెర్‌ఫెక్ట్ .. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) నేతృత్వంలో జరుగుతాయి. దీనికి లోకల్ స్పాన్సరర్‌గా భవానీ చారిటబుల్ ట్రస్ట్ (రాజమండ్రి) తరఫున సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు. రాజమహేంద్రవరం ఆల్ బ్యాంక్ కాలనీలో ఉన్న శ్రీ షిర్డీ సాయి విద్యానికేతన్ గ్రౌండ్‌లో శనివారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ముత్యాల ముగ్గుల పోటీలు ప్రారంభిస్తారు. పోటీల్లో పాల్గొనే మహిళలు ఒక గంట ముందే ప్రాంగణానికి చేరుకోవాలి. విజేతలకు అదే రోజు బహుమతులు అందజేస్తారు. మొదటి బహుమతి రూ.6 వేలు, రెండో బహుమతి రూ.4 వేలు, మూడో బహుమతి రూ.3 వేల నగదు అందజేస్తారు. మరో పది మందికి కన్సొలేషన్ బహుమతులు ఇస్తారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఏదొక చిరుకానుక ఇస్తారు. పోటీల్లో మహిళలు మాత్రమే పాల్గొనాలి. ముగ్గు, రంగులు, పువ్వులు, వగైరా సామగ్రి ఎవరికి వారే తెచ్చుకోవాలి. చుక్కల ముగ్గులు మాత్రమే పెట్టాలి. జడ్జీలు అడిగినప్పుడు ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు అని చెప్పగలగాలి. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం 2 గంటలు ఉంటుంది. ఈ మేరకు కళాశాల ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.

## ఆగిన డీసిల్టేషన్ ర్యాంపులు



కొవ్వూరు వద్ద ఉన్న ఇసుక ర్యాంపులో ఇసుకతీతను నిలిపివేసిన దృశ్యం

**అనుమతి కోసం ఎదురుచూస్తున్న బోట్స్‌మన్ సొసైటీలు**

రాజమహేంద్రవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అఖండ గోదావరిలో డీసిల్టేషన్ పేరిట జిల్లాలో బోట్సుమన్ సొసైటీల ద్వారా తీసే ఇసుకతీత ఆగింది. గత డిసెంబరు 31వరకే అనుమతి ఉన్నప్పటికీ, 2వతేదీ వరకూ చాలాచోట్ల ఇసుక తీశారు. దీంతో అధికారులు రంగంలోకి దిగి మొత్తం బోట్స్‌మన్ సొసైటీ ర్యాంపులన్నీ ఆపేశారు. రాజమండ్రి, కొవ్వూరు వైపు అధికంగా బోట్స్‌మన్ సొసైటీల ద్వారా ఇసుక తీస్తున్న సంగతి తెలిసిందే. ఈ సొసైటీలు ఇంకా అనుమతులు కోసం చూస్తున్నాయి. వీటికి ఎప్పుడు అనుమతి ఇస్తారనేది స్పష్టత లేదు. కానీ ఈ సొసైటీల మీద ఇప్పటికే ఆరోపణలు ఉన్నాయి. ఎక్కువ డబ్బు వసూలు చేస్తున్నారనే ప్రచారం ఉంది. కొవ్వూరులో వాడపల్లి, విజ్జేశ్వరం వైపు వాహనాలు కూడా రాకపోకలు సాగించని విధంగా రోడ్డంతా లారీలతో నింపేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికార పార్టీకి చెందిన ద్వితీయస్థాయి నేతలు కొందరు ఇక్కడ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీకి చెందిన ఓ సీనియర్ నేత గత రెండు నెలల నుంచి ఇక్కడ పరిస్థితిని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకుని వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. కానీ బోట్సుమన్ సొసైటీల ద్వారా కూటమి కార్యకర్తలు కూడా సొసైటీలను పొందడం వల్ల కొంతమేర లబ్ధి పొందుతున్నారు. దీంతో అనుమతి వస్తుందనే ధీమాతో ఉన్నారు. ప్రస్తుతం ఓపెన్ రీచ్‌ల ద్వారానే ఇసుకతీత జరుగుతోంది.

## నేడు గేమ్‌ఛేంజర్ సందడి

**పవన్‌కల్యాణ్, రామ్‌చరణ్ రాక.. భారీ ఏర్పాట్లు.. ట్రాఫిక్ మళ్లింపు**

రాజమహేంద్రవరం, జనవరి3(ఆంధ్రజ్యోతి): ప్రముఖ హీరో రామ్‌చరణ్ నటించిన 'గేమ్‌ఛేంజర్' సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహణకు భారీఏర్పాట్లు సిద్ధం చేశారు. వేమగిరి సమీపంలోని జాతీయ రహదారి పక్కన గతంలో టీడీపీ మహానాడు సభ జరిగిన స్థలంలో ఏర్పాట్లుచేస్తున్నారు. ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వస్తున్నారు. సుమారు 6 గంటలకు విమానాశ్రయానికి వచ్చి, అక్కడ నుంచి షెల్టన్ హోటల్‌కు చేరుకుంటారు. అక్కడ కాస్త విశ్రాంతి తీసుకున్న తర్వాత ఈవెంట్ స్థలానికి చేరుకుంటారు. రాత్రికి తిరిగి విమానంలో తిరిగి వెళతారు. ఆయనతోపాటు రాంచరణ్, హీరోయిన్, దర్శకులు, నిర్మాతలు రానున్నారు. 1100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ నరసింహకిశోర్ తెలిపారు. ఈవెంట్ స్థలం వైపు హైవేలు వాహనాలు వెళ్లకుండా బొమ్మూరు నుంచి దారి మళ్లించారు. బొమ్మూరు రాజవోలు మీదుగా కడియం సమీపంలో పేపరుమిల్లు దారి నుంచి కడియం మీదుగా వేమగిరి, రావులపాలెం వైపు ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను మళ్లించారు. కార్లు, ద్విచక్రవాహనాలను బాలాజీపేట, మీదుగా ధవళేశ్వరం వైపు మళ్లించారు. రావులపాలెం వైపు వచ్చే వాహనాలను అదే మార్గాలకు మళ్లించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు పలు సమస్యలను వివరిస్తున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

## ఎరువుల కొరతపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**ఎమ్మెల్యే నల్లమిల్లి విజ్ఞప్తితో వెంటనే ఆదేశాలు**

అనపర్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రైతులు యూరియా, డీఏపీ కొరతతో పడుతున్న ఇబ్బందులను అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సీఎం చంద్రబాబుకి వివరించడంతో ఆయన వెంటనే స్పందించారు. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసిన ఎమ్మెల్యే ఉమ్మడి జిల్లాలో యూరియా డీఏపీ కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బహిరంగ మార్కెట్‌లో ఎరువుల ధర పెరగక ముందే కొరత తీర్చాల్సిన అవసరం ఉందని వివరించారు. దీనికి స్పందించిన ముఖ్యమంత్రి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎరువుల కొరత రాకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

**వంతెన నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు**

బిక్కవోలు, జనవరి3(ఆంధ్రజ్యోతి): కాకినాడ కాలువపై కొంకుదురు వద్ద ఉన్న అసంపూర్తి వంతెన పూర్తి చేయడానికి సీఎం చంద్రబాబు రూ.2 కోట్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం సీఎంను ఎమ్మెల్యే కలసి 2012-13లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గోదావరి కాలువలపై చేపట్టిన నాలుగు వంతెనలు అసంపూర్తిగా ఉన్నాయని, కొంకుదురు వంతెన ప్రాముఖ్యం కాబట్టి నిధులు మంజూరుచేయాలని సీఎంను కోరగా నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే తెలిపారు.

# ఆర్గానిక్‌లో అద్భుతాలు..

## ప్రకృతి వ్యవసాయంలో సాగుపోతున్న రాంబాబు





క్రిమి సంహారక ఎరువులు, పురుగు మందుల మధ్య పుట్టుకొస్తున్న 'ఆహారం' అనారోగ్యాన్ని తెచ్చిపెడుతోంది. మందులు చల్లిన ఆహార ఉత్పత్తులకు అలవాటు పడ్డ మనిషి కొత్త కొత్త రోగాలను కొనితెచ్చుకుంటున్నాడు. ప్రస్తుతం అంతా స్పీడ్ సాగు..దీంతో అంతే స్పీడుతో ఆరోగ్య సమస్యలు కూడా వచ్చి పడుతున్నాయి. విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు పిచికారీతో అధిక దిగుబడులు సాధించడం తప్ప, నాణ్యమైన దిగుబడులు మాత్రం సాధించలేకపోతున్నారు. అయితే యువ రైతు ప్రగడ రాంబాబు ఆ రూటు ఎంచుకోలేదు..ప్రకృతి వ్యవసాయమే ఊపిరిగా సాగుతున్నాడు.

● రాజానగరం/ (ఆంధ్రజ్యోతి)



- ప్రకృతి వ్యవసాయ సాగులో ఆరితేరిన యువ రైతు ప్రగడ రాంబాబు
- క్లాప్ బీన్స్ సాగు భలే బాగు
- మిశ్రమ కూరగాయల సాగులో మేటిగా రాణింపు
- 'మార్కెటింగ్' తెలిసిన రైతుగా పేరు


పొట్టి పొట్ల కాయలు

### ప్రకృతి సాగే ఊపిరిగా..

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం నరేంద్రపురం గ్రామానికి చెందిన రాంబాబు దశాబ్ద కాలంగా ప్రకృతి వ్యవసాయ సాగులో ఆరితేరాడు.. ఆర్గానిక్ సాగు విధానంలో అనేక రకాలైన కూరగాయలతో పాటు వరి పంటను పండిస్తూ వ్యవసాయ శాస్త్రవేత్తల నుంచి అనేక అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు. గ్రామంలో గత పదేళ్లుగా నాలుగు ఎకరాల విస్తీర్ణంలో రాంబాబు 'పంట' ప్రయోగాలు చేస్తున్నాడు. ప్రకృతి సాగు విధానంలో మిశ్రమ కూరగాయల సాగులో రాణిస్తున్నాడు. తేలికపాటి నేలల్లో లవంగ, చిక్కుడు సాగు భలే బాగుంటుందని నిరూపిస్తున్నాడు.

### శాస్త్రవేత్తల క్షేత్ర సందర్శన

యువ రైతు రాంబాబు చేసే ప్రకృతి సాగు వ్యవసాయ విధానాన్ని అనేక రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు అనేక పర్యాయాలు క్షేత్ర సందర్శన చేశారు. చత్తీస్‌గఢ్‌కు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలతో కూడిన 25 మంది రైతుల బృందం క్షేత్ర సందర్శన చేసింది. అలాగే మహారాష్ట్ర నుంచి వ్యవసాయాధికారులు అక్కడి రైతులతో కలిసి సందర్శించారు. తూర్పుగోదావరి జిల్లాలోని వ్యవసాయాధికారులు, రైతులు అనేక పర్యాయాలు పర్యటించారు.


యువ రైతు రాంబాబు

### ప్రభుత్వం సహకరించాలి

ప్రకృతి వ్యవసాయంలో మార్కెటింగ్ సమస్య రైతులను వెంటాడుతోంది. ఖర్చులు ఎక్కువ, దిగుబడి తక్కువ. ప్రభుత్వం మార్కెటింగ్‌ను ప్రోత్సహించాలి. లేదంటే నేరుగా ప్రభుత్వం కొనుగోలు చేయాలి, లేనిపక్షంలో కనీసం హబ్‌లు ఏర్పాటు చేయాలి. సాగు విధానంలో మార్కెటింగ్ సదుపాయాలు తక్కువ, ఖర్చులు ఎక్కువ ఉంటున్నాయి. ప్రకృతి వ్యవసాయంలో సుభాష్ పాలేకర్ విధానంతో పాటుగా సొహాన్‌క్యూ, సీవీఆర్, సస్యరక్షణ శిలీంద్ర విధానాలను అవలంబిస్తున్నట్లు రాంబాబు వివరించాడు..

### క్లాప్ బీన్స్ (లవంగ చిక్కుడు)..

క్లాప్ బీన్స్ అనేది తీగ జాతికి చెందిన పాలు కారే మొక్క విత్తనాలు కేరళ నుంచి కిలో రూ.2 వేలు వంతున కొనుగోలు చేశారు. విత్తనం నాటిన 5 రోజులకు మొక్కలు పుట్టుకొచ్చి, 50 రోజులకు కాపు దశకు చేరుకుంటుంది. ఆకులు తమల పాకులను పోలి, పూలు తూటి పువ్వులు మాదిరిగా ఉంటాయి. ప్రస్తుతం రెండు ఎకరాల్లో క్లాప్ బీన్స్ సాగులో ఉంది. ప్రస్తుతం కిలో రూ.100 వరకు ధర ఉంది.

### క్లాప్ బీన్స్ గుణగణాలు

క్లాప్ బీన్స్ పూర్తి శీతాకాల పంట. సాగులో తెగుళ్లు, చీడ పీడలను తట్టుకుని అధిక దిగుబడులు ఇస్తుంది. అలాగే నిల్వ సామర్థ్యం కూడా దీని సొంతం. వర్షాకాలంలో వచ్చే ఆకాకర సాగు తర్వాత క్లాప్ బీన్స్ పూర్తి శీతాకాలపు సాగుగా చెప్పొచ్చు. క్లాప్ బీన్స్‌లో పోషకాలు కూడా పుష్కలంగా ఉంటాయి.


లవంగ చిక్కుడు ఎగుమతికి సిద్ధం

### వివిధ రకాల సాగు

రాంబాబు తన నాలుగు ఎకరాల పొలంలో స్నేక్ గార్డ్ (పిచ్చుక పొట్ల కాయ), గ్రీన్ సొరకాయ, చిత్రాడ బీర, కూర దోస, గ్రీన్ పిచ్చుక పొట్లకాయ, గ్రీన్ దేశవాళీ కీరదోస, వైట్ దేశవాళీ కీరదోస, దేశవాళీ పొడవు కీరా, ఆనబకాయ, బొబ్బర్లు (లాంగ్ వెరైటీ), బీర, దొండ, కాకర, మిర్చి తదితర పంటను సాగు చేశాడు. ప్రస్తుతం క్లాప్ బీన్స్ (లవంగ చిక్కుడు)తో పాటుగా తమ్మ చిక్కుడు, కూర బొబ్బర్లు (పొడవు), వెల్‌వెట్ బీన్స్, మామిడి అల్లం, పసుపు, దొండ, బొప్పాయి, మిర్చి, టమాట వంటి రకాలు సాగులో ఉన్నాయి. ఏడాది కాలంలో మూడు పంటలుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని మార్చి నెలలో శ్రీకారం చుట్టి ఫిబ్రవరి నాటికి పూర్తిచేస్తాడు. ప్రతి రెండేళ్లకోసారి పంట మార్పిడిలో వరి, మినుము, పచ్చిరొట్ట ఎరువులు సాగు చేస్తాడు. వీటిలో ప్రధానంగా రెండు పంటలు కూరగాయలు సాగు ఉంటుందని అతను చెబుతున్నాడు..

# సముద్రంలో అలవోకగా..

- వైజాగ్ నుంచి కాకినాడకు ఈదుకుంటూ..
- అవలీలగా ఆరు రోజుల్లో 150 కిలోమీటర్ల ఈత
- దేశంలోనే తొలి మహిళా స్విమ్మర్‌గా రికార్డు
- మహిళా స్విమ్మర్ గోలి శ్యామలకు ఘనస్వాగతం


సముద్రంలో జాతీయ పతాకంతో స్విమ్మర్ శ్యామల

సర్పవరంజంక్షన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సువిశాల సముద్రం.. ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న కెరటాలు. సముద్రంలో జెల్లీ ఫిష్‌లు వెంటపడి కొరుకుతున్నా.. భయంకరమైన వేల్ ఫిష్ దాడికి ప్రయత్నించినా సప్త సముద్రం, బంగాళాఖాతంలో 150కిలోమీటర్ల మేర సముద్రంలో ఈత లక్ష్యాన్ని పూర్తిచేయాలన్న సంకల్పం ముందు అవరోధాలు ఏమీ కానరాలేదు. కేవలం 6 రోజుల్లో రోజుకు 20-30కిలోమీటర్లు సముద్రంలో ఈత కొట్టి వైజాగ్ నుంచి కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు సముద్రంలో 150 కిలోమీటర్ల లక్ష్యాన్ని అవలీలగా ఈదేసి అరుదైన రికార్డును సొంతంచేసుకున్నారామె. ఆమె కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన 52ఏళ్ల మహిళా స్విమ్మర్ గోలి శ్యామల.

యానిమేషన్ సినిమాల నిర్మాత, దర్శకురాలిగా, రచయితగా, పలు బిజినెస్‌లు చేసి నష్టపోయి డిప్రెషన్‌కు లోనై కోమాలోకి కూడా వెళ్లిన ఆమె ఇప్పుడు అంతర్జాతీయ వాటర్ స్విమ్మర్‌గా రికార్డులను తనపేరున లిఖించుకున్నారు.మహిళల ఆరోగ్య, మానసిక సమస్యలనుంచి ఆరోగ్యంగా ఉండేలా, పర్యాటకరంగం అభివృద్ధి కోసం శ్యామల విశాఖ ఆర్కే బీచ్ నుంచి కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌వరకు 150కిలోమీటర్లు సముద్రంలో ఈత ఈది రికార్డు సృష్టించాలని నిర్ణయించుకుంది. డిసెంబరు 28న విశాఖ ఆర్కే బీచ్‌లో ఎంపీ భరత్ సముద్రంలో సాహస యాత్రకు జెండా ఊపి ప్రారంభించారు. విశాఖతీరంనుంచి సముద్రంలో ఈత ఈదుకుంటూ శుక్రవారం జనవరి 3న కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు అవలీలగా లక్ష్యాన్ని చేరుకున్నారు. సుదీర్ఘ సముద్రంలో 150కిలోమీటర్లు ఈత ఈదిన తొలి ఆసియా స్విమ్మర్‌గా శ్యామల అరుదైన రికార్డు సాధించారు. ఎన్టీఆర్ బీచ్‌కు చేరుకున్న ఆమెకు కోరమండల్ ఒడిస్సీ ఓషియన్ స్విమ్మింగ్, కాకినాడ సీపోర్టు ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ భావన ఘన స్వాగతం పలికారు.

### మహిళల్లో చైతన్యం.. ఆరోగ్య సంరక్షణకు..

అభినందనసభలో మహిళా స్విమ్మర్ గోలి శ్యామల మాట్లాడుతూ మహిళల్లో చైతన్యం ఆరోగ్య సంరక్షణ, పర్యాటక రంగం అభివృద్ధికి సముద్రంలో ఈతను నేర్చుకున్నామన్నారు. శ్రీలంకనుంచి రామసేతు వరకు, లక్షద్వీప్ సముద్రంలో ఈతఈది పలు రికార్డులు సాధించానన్నారు. అమెరికాలో జరిగిన ఈత పోటీల్లో 36కిలోమీటర్ల కాటలినా ఛానల్‌ని ఈదానన్నారు. ఓ ఆంగ్ల పత్రికలో ఇంగ్లీష్ ఛానల్ ఈదిన వ్యక్తి కథనం ఈత వైపు వెళ్లేలా చేసిందని, లక్షద్వీప్‌లో జరిగిన పర్యాటక అభివృద్ధిలో పాల్గొనేందుకు విచ్చేసిన ప్రధాని మోదీ చేసిన ప్రచారం నాలో స్ఫూర్తిని నింపిందన్నారు. లక్ష్యసాధనకు కృషిచేయాలని, ప్రతిఒక్కరూ ఈత నేర్చుకోవడం ద్వారా తల


స్విమ్మర్ శ్యామలను అభినందిస్తున్న పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, కాకినాడ కమిషనర్ భావన, కాకినాడ సీపోర్టు ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు

వెంట్రుక నుంచి శరీరంలో ఉన్న అన్ని భాగాలకు పూర్తి వ్యాయామం చేసినట్లు అవుతుందన్నారు. ప్రపంచంలోనే నాలుగో అంతర్జాతీయ స్విమ్మర్‌గా, దేశంలో నేనే నెంబర్‌వన్‌గా నిలవడం ఆనందంగా ఉందన్నారు. కోచ్‌జాన్ సివిక్ పర్యవేక్షణలో హైదరాబాద్‌లో తాను జాయింట్ స్పోర్ట్స్ నేర్చుకున్నానన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో కష్టాలు ఎదురవుతాయని, అలాంటి సమయంలో ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకుందామని భావించకుండా మైండ్ డైవర్షన్ చేసుకోవడం ద్వారా ఒత్తిడినుంచి బయట పడవచ్చన్నారు. ఎమ్మెల్యే రాజప్ప, రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ వైడీ రామారావు,కాకినాడ సీపోర్టు ప్రైవేట్ లిమిటెడ్ జీఎం మురళీధర్, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


పోటీల ప్రారంభవేళ పుంగనూరు ఆవుదూడతో ఎమ్మెల్యే వరప్రసాద్

## కేశనపల్లిలో రాష్ట్ర స్థాయి

# ఆవుల అందాల పోటీలు

మలికిపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గో సంరక్షణ చాలా ప్రధాన అంశమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. పశు సంపదను కాపాడుకున్ననాడే గ్రామాలు సిరిసంపదలతో విరాజిల్లుతాయన్నారు. గ్రామీణస్థాయిలో రాష్ట్రస్థాయి ఒంగోలు



పాల పోటీలు, ఒంగోలు, పుంగనూరు, గిరి ఆవుల అందాల పోటీలు ఏర్పాటు చేయడం నిర్వాహకుల గొప్పదనానికి నిదర్శనమన్నారు. డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లిలో అడబాల లక్ష్మీనారాయణ (నాని) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. వివిధ రకాల జాతుల ఆవులను పరిశీలించారు. కాసేపు గుర్రంపై సవారీ చేశారు. కార్యక్రమంలో కేశనపల్లి సర్పంచ్ యెనుముల నాగు, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, గుండుబోగుల పెద్దకాపు, పినిశెట్టి బుజ్జి, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, మల్లిపూడి సత్తిబాబు, గుబ్బల ఫణి, సూరిశెట్టి శ్రీనివాస్, మందపాటి నాగేశ్వరరావు, గుర్లింక సత్యనారాయణ, అడబాల సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.




పోటీలో ఆకట్టుకున్న పలు రకాల ఆవులు


విద్యార్థినులు పరీక్ష రాస్తున్న తీరును పర్యవేక్షిస్తున్న చీఫ్ ఎగ్జామినర్, జీటీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ

# ప్రశాంతంగా జీఎన్ఎం పరీక్షలు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల్లోని పలు నర్సింగ్ విద్యా సంస్థల్లో జీఎన్ఎం శిక్షణ పొందుతున్న విద్యార్థులకు వార్షిక పరీక్షలు రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనా సర్వజన ఆసుపత్రి (జీటీజీహెచ్)లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎంసీహెచ్ బ్లాకులోని పై అంతస్తులో కేంద్రాన్ని కేటాయించారు. జీటీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీసూర్యప్రభ పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. రెండు సెషన్లుగా జీఎన్ఎం పరీక్షలు జరుగుతాయని, పరీక్షలకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బంది, అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని చీఫ్ ఎగ్జామినర్‌గా వ్యవహరిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ వెల్లడించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు ఈ నెల 11వ తేదీ వరకు, తృతీయ సంవత్సరం వారికి మళ్లీ 6వ తేదీన పరీక్ష నిర్వహిస్తారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఉదయం, తృతీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం వేర్వేరుగా పరీక్షలు నిర్వహించారు. రెండు జిల్లాల నుంచి 21 స్కూల్స్‌కు చెందిన మొత్తం 1,500వందల మంది కిపైగా పరీక్షలు రాస్తున్నారు. ఉదయం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు, మధ్యాహ్నం నుంచి తృతీయ సంవత్సరం విద్యార్థినులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. తొలిరోజున మొదటి సెషన్‌లో 981 మందికి 844మంది పరీక్షలకు హాజరయ్యారు. 140 మంది గైర్హాజరయ్యారు. రెండవ సెషన్‌లో 550 మందికి 25 మంది హాజరుకాలేదు. చీఫ్ ఇన్విజిలేటర్ కె.లక్ష్మి, చీఫ్ సూపర్‌వైజర్ ఆఫీసర్ ఆర్.శ్యాంసుందరరావు, ఆసుపత్రి మేనేజర్ కె.కేదారేశ్వరరావు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.


వీరుళ్లమ్మ అమ్మవారికి అభిషేకం నిర్వహించేందుకు గోదావరి జలాలను తీసుకువస్తున్న మహిళలు

# వీరుళ్లమ్మకు వైభవంగా హరిద్రాభిషేకం



అనపర్తి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మకు శుక్రవారం 1008 మంది ముత్తయిదువులు హరిద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయం నుంచి మహిళలు ఎర్ర కాలువ వద్దకు చేరుకుని గోదావరి జలాలను కలశాల్లో నింపుకున్నారు. మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని జలాల్లో హరిద్రం కలిపి అమ్మవారి మూలవిరాట్టుకు అభిషేకం చేశారు. హరిద్రాభిషేకంలో పాల్గొంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తాంబూలం, ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.


వీరుళ్లమ్మ అమ్మవారి మూలవిరాట్‌కు హరిద్రాభిషేకం నిర్వహిస్తున్న భక్తురాలు

# ఆదిత్య యూనివర్సిటీని సందర్శించిన సినీ ప్రముఖులు

గండేపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీకి తెలుగు సినీ ప్రముఖులు పలువురు శుక్రవారం విచ్చేశారు. ఇంద్ర, సమరసింహారెడ్డి వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించిన ప్రముఖ దర్శకుడు బి.గోపాల్, మెగాస్టార్ చిరంజీవితో 25కు పైగా విజయవంతమైన చిత్రాలు తీసిన ఎ.కోదండరామిరెడ్డి, తెలుగులోనే కాకుండా కొన్ని బాలీవుడ్ సినిమాలకు పని చేసిన ఎస్.గోపాల్ రెడ్డి, ప్రముఖ సంగీత దర్శకుడు కోటి సందర్శించారు. వారందరికీ ఆదిత్య యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.


సినీ ప్రముఖులను సత్కరించిన ఆదిత్య యూనివర్సిటీ చాన్సలర్ శేషారెడ్డి

# మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

**● మంత్రి అచ్చెన్నాయుడు ● మత్స్యకారులకు నష్టపరిహారం అందజేత**

తాళ్లరేవు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేస్తామని, ఆ వృత్తి చేస్తూ జీవనోపాధి కోల్పోయిన నష్టపోయిన రైతులకు 23,450 మందికి ఓఎన్‌జీసీ ద్వారా ఒక్కొక్కరికి రూ.63,250 చొప్పున మొత్తం రూ.148 కోట్ల37లక్షల18,500 నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్, పశుసంవర్థక, మత్స్యకాశాఖా మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరింగ గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లాలో ఓఎన్‌జీసీ పైపు లైను వల్ల నష్టపోయిన మత్స్యకారులకు నష్టపరిహారం ఓఎన్‌జీసీ సంస్థ నుంచి అందజేశారు. శుక్రవారం ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ బహిరంగ సభలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ సహకారంతో కూటమి ప్రభుత్వం అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలుచేసేందుకు కృషి చేస్తుందన్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసి రాష్ట్రాన్ని అప్పులు పాల్జేసిపోయిందన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్రాన్ని గాడిలోపెట్టేందుకు అన్నివిధాలా కృషి చేస్తున్నారన్నారు. మరో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ముమ్మిడివరం నియోజకవర్గానికి సంబంధించి 20,878 మందికి రూ.63,250 చొప్పున రూ.132కోట్ల 5లక్షల33వేలు, పి.గన్నవరం, కొత్తపేట, మండపేట, రామచంద్రపురంలో 69మందికి సుమారుగా రూ.16 కోట్లు మొత్తం 23,458మందికి రూ.148కోట్ల 38లక్షలు వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని తెలి పారు. ఎమ్మెల్యే దాట్ల మాట్లాడుతూ మత్స్యకారులకు సబ్సిడీ రుణాలు, వలలు, పనియుట్లు అం దించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 1000 కిలోమీటర్లు వరకు కోస్టల్ ప్రాంతం ఉందని దీన్ని అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రణాళికలు తయారుచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ గంటి హరీష్ మాదుర్, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి వెంకటేశ్వరావు, అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, మత్స్యశాఖ కమిషనర్ టిడోలా శంఖర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.


కోరింగలో మత్స్యకారులకు నష్ట పరిహారం చెక్కును అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు


సభలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

# మార్చి నాటికి పన్నులు వసూలు చేయాలి

**కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో 6 మున్సిపాల్టీలపై రీజనల్ డైరెక్టర్ నాగనరసింహారావు సమీక్ష**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీ...పాల్గొన్న కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది

కొవ్వూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మార్చి నాటికి ఆస్తి పన్ను, కుళాయి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు వంద శాతం వసూలు చేయాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ సిహెచ్. నాగనరసింహరావు ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు సమీక్షా సమావేశాలకు పూర్తి సమాచారంతో హజరుకావాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు లిటరరీ క్లబ్ కళ్యాణ మండపంలో శుక్రవారం కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలోని 6 మున్సిపల్ కమిషనర్లు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపాల్టీల్లో ఆస్తి పన్ను, కుళాయి పన్ను, పారిశుధ్యం, ఇంటింటా చెత్త సేకరణ, వీధి దీపాల నిర్వహణ, తడి, పొడి చెత్త వేరుచేయడం, ట్రేడ్ లైసెన్సులు, తాగునీటి సరఫరా, పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారం, సచివాలయ కార్యదర్శుల అటెండెన్స్ వంటి అంశాలపై మున్సిపాల్టీల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం టౌన్ ప్లానింగ్, మెప్మా సిబ్బందితో సమీక్ష చేశారు. నాగనరసింహరావు మాట్లాడుతూ ప్రతినెలా జిల్లాల వారీగా మున్సిపాల్టీల ప్రగతిపై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. కొన్ని మున్సిపాల్టీలు సచివాలయ కార్యదర్శుల అటెండెన్స్‌లోను, పన్నుల వసూలు, కొత్త అసెస్‌మెంట్లు, ఎడిషన్ ఆల్ట్రేషన్స్‌లో బలహీనంగా ఉన్నాయన్నారు. మున్సిపాల్టీల డేటాను కమిషనర్ చెక్ చేయకుండా ఆర్డీ కార్యాలయానికి పంపించవద్దన్నారు. మండపేట, రామచంద్రాపురం, ముమ్మిడివరం మున్సిపాల్టీలు నాన్ రెసిడెన్స్ ప్రాంతాలని, కమర్షియల్ ప్రాంతాల్లో ఆదాయం పెంచుకోవడానికి కౌన్సిల్ ఆమోదంతో గెజిట్ పబ్లికేషన్ చేసుకోవాలన్నారు. తదుపరి సమావేశానికి గెజిట్ పబ్లికేషన్ చేయకపోతే కమిషనర్లు వివరణ ఇవ్వవలసి ఉంటుందన్నారు. ఇంటింటా సేకరించిన చెత్తను తగలబెట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ అడ్మిన్, ప్లానింగ్, ఎమినిటీ, శానిటేషన్ సెక్రటరీలు ఉదయం నిర్ధిత సమయానికి విధులకు హజరుకావాలన్నారు. ఆన్‌లైన్‌లో అటెండెన్స్ తనిఖీ చేస్తామన్నారు. జనవరి నెలాఖరులోగా మున్సిపాల్టీల్లో గుంతలు పడిన రహదారుల మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించాలని లేకుంటే మున్సిపాల్టీల నిర్వహణ, అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ఆస్తి పన్ను, వడ్డీ మాఫీ ఉండదన్నారు. తడి, పొడి చెత్త వేరుచేసి అందించి, సహకరించాలన్నారు. ప్రతి నెల సమీక్షా సమావేశాలు కొనసాగుతాయన్నారు. సమావేశంలో అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రపురం, మండపేట, నిడదవోలు, కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌లు, ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

# విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని కలిగిఉండాలి

**ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ**

**కాకినాడలో విద్యావైజ్ఞానిక ప్రదర్శన**

కాకినాడ రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ అన్నారు. కాకినాడ సాలిపేట పీఎస్‌రాజు మున్సిపల్ కార్పొరేషన్ బాలికోన్నత పాఠశాలలో కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ ఆధ్వర్యంలో దక్షిణభారత విద్యావైజ్ఞానిక ప్రదర్శన 2025కు సంబంధించిన జిల్లాస్థాయి పోటీలను శుక్రవారం జిల్లాసైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీలు కె.పద్మశ్రీ, ఐ.వెంకటేశ్వరరావు, కౌడా చైర్మన్ తమ్మల బాబు, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్ పాల్గొని వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఐవీ మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎప్పుడూ విద్యార్థులకు శాస్త్రీయ అంశాలను మాత్రమే తెలియజేయాలన్నారు. పద్మశ్రీ మాట్లాడుతూ మానవ మెదడే అతిపెద్ద కంప్యూటరని ఆలోచనలకు పదునుపెడితే ఏదైనా సాధించవచ్చన్నారు. సుధీర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు వివిధ నూతన కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నదన్నారు. అతిథులు జ్యోతిప్రజ్వలనచేసి పోటీల లోగోను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను అతిథులు పరిశీలించారు. కాకినాడ జిల్లాలోని 21 మండలాల నుంచి వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు 109 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వ్యక్తిగత విభాగంలో 36, గ్రూప్‌లో 39, ఉపాధ్యాయుల విభాగంలో 34 ప్రాజెక్టులను ప్రదర్శించారు. సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో డీఈవో పి.రమేష్, కాకినాడ, పెద్దాపురం డీవైఈవోలు వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌శర్మ, జీసీడీవో ఉమా మహేశ్వరి విద్యార్థులకు బహుమతులను అంద జేశారు. మొదటి రెండుస్థానాల్లో నిలిచిన ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని డీఈవో తెలిపారు. విజేతలకు యంగ్ మైండ్స్ అధ్యక్షులు వాకాడ వెంకటరమణ పరీక్షా అట్టలు, పుస్తకాలు, పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ప్రాజెక్టు అధికారి పి.వేణుగోపాలరావు, ఎంఈవోలు సీహెచ్ రవి, సత్యనారాయణ, శ్రీనివాసరావు పీడీలు బంగారాజు, రవిరాజు, రంగారావు పాల్గొన్నారు.



మానవ అస్థిపంజరం, ఐడీ కార్డు చెకింగ్ స్కానర్ ప్రదర్శనలు

## మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

కాకినాడ క్రైం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా మహిళా అభ్యర్థులకు కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు నాలుగో రోజైన శుక్రవారం ప్రత్యేకంగా మహిళలకు కేటాయించారు. మొత్తం 295మంది హాజరు కాగా తదుపరి పరీక్షకు 180మంది అర్హత సాధించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థినులకు నిర్వహించిన పరీక్షలను జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పర్యవేక్షించారు.

## కత్తితో బెదిరించి..

**గోల్డ్ చైన్ చోరీ చేసిన ఇద్దరి అరెస్టు**

పిఠాపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కత్తితో చంపుతానని బెదిరించి బంగారు చైన్, నగదు చోరికి పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్ శుక్రవారం రాత్రి వెల్లడించారు. పిఠాపురం మండలం నరసింగపురానికి చెందిన బొలిశెట్టి వెంకటరమణ, లక్ష్మీ పిఠాపురంలోని పూర్ణా, అన్నపూర్ణా థియేటర్ వద్ద నడిచి వెళ్తుండగా ఈనెల 2వ తేదీ మధ్యాహ్నం ఇద్దరు బైక్‌పై వచ్చి వారిని కత్తితో పొడిచి చంపుతామని బెదిరించి బంగారు గొలుసు, రూ.500 చోరీ చేసి పరారయ్యారు. ఎస్ఐ, సర్కిల్ క్రైమ్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి విచారణ జరిపి చోరికి పాల్పడిన పిఠాపురం రథాలపేటకు చెందిన పూడి గంగాధర్, మంగితుర్తి గ్రామానికి చెందిన డెక్కల ఆనంద్‌ను అరెస్టు చేసి వారి నుంచి బంగారు చైన్, బైక్, కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

# సరదాగా ఈతకు దిగి

**గోదావరిలో యువకుడు గల్లంతు**


గల్లంతైన వీరమణికంఠ (ఫైల్ ఫొటో)

ముమ్మిడివరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సరదాగా గోదావరిలో ఈతకు దిగి ఓ యువకుడు గల్లంతయ్యాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కొత్తలంకకు చెందిన ముగ్గురు యువకులు సరదాగా కేశనకుర్రు గోదావరి పాయ చెంతకు వెళ్లారు. వారిలో మంగ విజయవీరమణికంఠ (19) కొద్దిగా ఈత రావడంతో గోదావరిలో దిగాడు. స్నేహితులు మంగ జశ్వంత్, పొత్తూరి పార్థసారధిలకు ఈత రాకపోవడంతో వారు ఒడ్డునే ఉన్నారు. మణికంఠ గోదావరిలో దిగా కొంతదూరం ఈదినా తరువాత ఉక్కిరిబిక్కిరి కావడంతో గోదావరిలో మునికి గల్లంతయ్యాడు. వారు ముగ్గురు ఓడలరేవు ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కొత్తలంకకు చెంది మంగ నాగేశ్వరరావు-మహలక్ష్మి దంపతులకు లక్ష్మీన వీన,సాయిశ్రీ కుమార్తెలు ఉండగా, విజయవీరమణికంఠ ఆఖిరి సంతానం. ఒక్కగానొక్క కుమారుడు గోదావరిలో గల్లంతు కావడంతో ఆ కుటుంబలోను, గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. ఎస్ఐ డి.జ్వాలాసాగర్, పోలీసులు గోదావరి నదీ పాయలో గాలింపు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం వరకు మణికంఠ ఆచూకీ లభ్యం కాలేదు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

# గంజాయి రవాణా చేస్తున్న నలుగురి అరెస్ట్

**రూ.3.42 లక్షల విలువైన 68.6 కిలోల గంజాయి, కారు, సెల్‌ఫోన్ స్వాధీనం**

జగ్గంపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వివరాలను శుక్రవారం జగ్గంపేట పోలీస్ సర్కిల్ కార్యాలయం వద్ద జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఈనెల 31న కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామం టోల్‌గేట్ వద్ద గంజాయి తరలిస్తున్నారని సమాచారం రావడంతో అర్ధరాత్రి వేళ టోల్‌ప్లాజ్ వద్ద సీఐ వైఆర్‌కె శ్రీనివాసరావు, కిర్లంపూడి ఎస్ఐ సతీష్ బృందంతో కలిసి యూపీ81 బీడీ4243గల కారును ఆపగా ఆపినట్టే ఆపి ఒక్కసారిగా వేగంగా నడపడంతో అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ లోవరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటకే కాకినాడ మెడికోవర్ ఆసుపత్రికి తరలించారు. అయితే కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఆ కారులో గంజాయి ఉన్నట్టు సమాచారం అందింది. దీంతో పోలీసులు నిందితుల కోసం గాలించగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన తరుణ్‌కుమార్, జాహిద్, ముస్తాకిమ్, మహ్మద్ జాభీర్‌ఖాన్‌ను శుక్రవారం కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామం పోలవరం కాలువ వద్ద కారుతో అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని పాడేరు ఏజెన్సీ ప్రాంతం నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ఆలీఘడ్‌కు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రూ.3.42 లక్షల విలువైన 68.6 కిలోల గంజాయి, రూ.20.5 లక్షలు విలువైన కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నింది తులను పట్టుకునేందుకు ఎంతో కృషి చేసిన జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్ఐ సతీష్, క్రైం హెచ్‌సీ జె.నాగరాజు, కానిస్టేబుల్ ఆర్.లోవరాజు, టీఎస్ దుర్గాప్రసాద్, ఎ.జయరాం, హోంగార్డు ప్రసాద్, గిరిలను ఎస్పీ అభినందించారు. విధి నిర్వహణలో గాయపడిన కానిస్టేబుల్ లోవరాజును పరామర్శించారు. లోవరాజు భార్య, కుటుంబ సభ్యులకు ఎస్పీ ధైర్యం చెప్పి వైద్యానికి అయ్యే ఖర్చు అంతా పోలీస్ శాఖ భరిస్తుందని ధైర్యంగా ఉండాలన్నారు.


జగ్గంపేటలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

# కళాశాలకు బయలుదేరి.. అంతలోనే కన్నుమూసి!

**ఆగి ఉన్న కంటెయినర్‌ను బైక్ ఢీకొని విద్యార్థి మృతి, మరొకరికి తీవ్రగాయాలు**


కంటెయినర్‌ను బైక్ ఢీకొన్న దృశ్యం


నవనీత్ (ఫైల్)

అనపర్తి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం పులగుర్త వద్ద మండపేట-రామచంద్రపురం కెనాల్ రోడ్డులో గురువారం అర్ధరాత్రి దాటాక జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనుగుదురులో నిమ్స్ కళాశాలలో ఫిజియోథెరపీ విద్యనభ్యసిస్తున్న ఇద్దరు విద్యార్థుల్లో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రగాయాల పాలయ్యారు. ఏఎస్ఐ దుర్గాప్రసాద్ వివరాల ప్రకారం.. తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామానికి చెందిన పుచ్చకాయల నవనీత్(22), ద్వారకా తిరుమల మండలం కమరి గ్రామానికి చెందిన మానుకొండ చందు కాకినాడ జిల్లా పెనుగుదురు గ్రామంలోని కిమ్స్ ఫిజియోథెరపీ కళాశాలలో చదువుకుంటూ అదే కళాశాలలోని హాస్టల్‌లో ఉంటున్నారు. ఇద్దరూ బైక్‌పై కళాశాలకు వెళ్తుండగా పులగుర్త గ్రామం వచ్చే సరికి రోడ్డు పక్కన ఆగి ఉన్న ఖమ్మం నుంచి కాకినాడ వెళ్లే కంటెయినర్‌ను వెనుక నుంచి ఢీకొన్నారు. తీవ్ర గాయాలపాలైన ఇద్దరినీ స్థానికులు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే నవనీత్ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. చందుకు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

## ప్రక్కిలంకలో విషాదఛాయలు

తాళ్లపూడి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం పులగుర్త వద్ద జరిగిన ప్రమాదంలో ప్రక్కిలంక గ్రామానికి చెందిన పుచ్చకాయల నవనీత్ మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నవనీత్ పెనుగుదురులోని కిమ్స్ ఫిజియోథెరపీ కళాశాలలో బీఎస్సీ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. నవనీత్ తండ్రి బాల మురళీకృష్ణ ప్రక్కిలంకలోని పైడి ఐటీఐ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా చేస్తుండగా తల్లి భారతి మండలంలోని గజ్జరం గ్రామంలో సచివాలయ మహిళా పోలీస్‌గా పనిచేస్తున్నారు. సోదరుడు స్నేహిత్ రాజమహేంద్రవరం గైట్ కళాశాలలో బీఎస్సీ (ఫోరెన్సిక్) ఫైనలియర్ చదువుతున్నాడు. అన్నదమ్ములిద్దరూ కవలలు. నవనీత్ మృతితో ఆ ప్రాంతమంతా విషాదం అలుముకుంది. నవనీత్ తల్లి భారతి రోదనలు మిన్నంటాయి.

# హైవేపై లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా..

**బైక్ హ్యాండిల్ లారీకి తగిలి యువకుడి మృతి.. మరో యువకుడికి స్వల్ప గాయాలు**


సంఘటనా స్థలంలో మరణించిన భరత్‌చంద్ర

రాజానగరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై లారీని బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు ఓవర్‌టేక్ చేస్తుండగా ప్రమాదం జరిగి ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తూర్పుగోదావరి జిల్లా గైట్ కళాశాల సమీపంలో హైవేపై శుక్రవారం ఉదయం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు గ్రామానికి చెందిన మంగం భరత్‌చంద్ర(20), గొల్లపల్లి నాగేంద్ర స్నేహితులు. పెయింటింగ్ పనులు చేస్తుంటారు. కాకినాడలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భరత్‌చంద్ర బంధువు అయిన కృష్ణబాబుకు సీరియస్‌గా ఉందని సమాచారం రావడంతో గురువారం రాత్రి మోటార్‌సైకిల్‌పై కాకినాడ వెళ్లారు. రాత్రికి అక్కడే ఉండి శుక్రవారం ఉదయం తిరిగి తొర్రేడు పయనమయ్యారు. మార్గమధ్యలో గైట్ కళాశాల వద్దకు వచ్చే సరికి హైవేపై ముందు వెళ్తున్న లారీని అధిగమిస్తున్న తరుణంలో మోటార్‌సైకిల్ హ్యాండిల్ లారీకి తగలడంతో అదుపుతప్పి బైక్ నడుపుతున్న భరత్‌చంద్ర అదే లారీ కిందపడి పడి అక్కడికక్కడే మరణించాడు. నాగేంద్ర స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కేవీ నాగార్జున తెలిపారు.

# అంగరలో ఓఎన్జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీక్

**» లీకేజీని అరికట్టిన అధికారులు, సిబ్బంది » భయాందోళనలో గ్రామస్తులు**

కపిలేశ్వరపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామంలో శుక్రవారం ఓఎన్జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీకైంది. దీంతో గ్రామస్తులు ఏం జరుగుతుందోనని భయాందోళనలు చెందారు. ఓఎన్జీసీ, ఫైర్ అధికారులు, సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలో ఓఎన్జీసీ డ్రిల్‌పాయింట్ నుంచి వేరే చోటుకు వెళ్లే పైప్‌లైన్ నుంచి గ్యాస్ లీకైంది. దీంతో దానికి సంబంధించిన 4 ఛానల్స్‌ను మండపేట గ్యాస్ కలెక్టింగ్ స్టేషన్ నుంచి మూసివేశారు. లీకైన గ్యాస్ ప్రెజరు తగ్గించేందుకు ఫైర్ సిబ్బంది వాటర్ స్ప్రే చేయడంతో గ్యాస్ ప్రెజర్ జీరోకు తగ్గిందని మండపేట ఫైర్ ఆఫీసర్ హనుమంతరావు తెలిపారు. అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి లీకేజీని అరికట్టడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. అంగరలో ఓఎన్జీసీ పాయింట్ వద్ద గ్యాస్ లీకేజీ ఏర్పడినట్టు తెలియడంతో ఆ ప్రాంతాన్ని అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరిశీలించారు. సంఘటనకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై సైట్ ఇన్‌చార్జ్ సుబ్బారావును వివరణ అడగ్గా అడుగున ఉన్న పైప్‌లైన్ శుభ్రం చేస్తుండగా యుబెండ్ జాయింట్ వద్ద ప్రెజర్‌కు గ్యాస్ లీకై బయటకు వచ్చిందని, వెంటనే దాన్ని బంద్ చేశామన్నారు. కానీ ఆపైప్‌లోని గ్యాస్ కొంత బయటకు వచ్చిందని తెలిపారు. దీనిపై రిస్క్ ఏమైనా ఉంటుందా అని అడగగా ఎలాంటి రిస్క్ ఉండదని, టెక్నీషియన్స్ పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉంటుందన్నారు. దీనిపై గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తుండగా రాబోయే రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఎంపీ, జిల్లా కలెక్టర్, ఓఎన్జీసీ ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే తెలిపారు. సంఘటనా స్థలాన్ని తహశీల్దార్ పి.చిన్నారావు, మండపేట సీఐ దొరరాజు, అంగర ఎస్ఐ రవికుమార్, ఈవోపీఆర్డీ మోహన్,సర్పంచ్ కోటేశ్వరరావు పరిశీలించారు.


వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేగుళ్ల

# నేడు గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్

కడియం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రౌండ్‌లో శనివారం జరిగే గేమ్ ఛేంజర్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హైదరాబాదుకు చెందిన ఈవెంట్ నిర్వాహకులు వేదికను సిద్ధం చేస్తున్నారు. సభా వేదిక వద్ద ట్రాఫిక్ విధానాలను పరిశీలించడానికి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్, ఏఎస్పీలు ఏబీఎన్ మురళీకృష్ణ, సుబ్బరాజు, డీఎస్పీలు భవ్యకిషోర్, దేవకుమార్, రమేష్, పలు స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు. లక్ష మంది పైగా మెగా అభిమానులు ఈ ఈవెంట్‌ను తిలకించడానికి వస్తారని అంచనా. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, దర్శకులు శంకర్, సినిమా యూనిట్ ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. ఆలిండియా చిరంజీవి ఫాన్స్ అధ్యక్షుడు రవణం స్వామినాయుడు, చిరంజీవి అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడిద బాబి, మెగా అభిమానులు సభా ప్రాంగణాన్ని పరిశీలించారు.


ఈవెంట్‌కు సిద్ధం అవుతున్న వేదిక

# రేపు విజయవాడలో హైందవ శంఖారావం



విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో మీడియా సమావేశం

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అజమాయిషీ నుంచి తప్పించి దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 5న విజయవాడ గన్నవరం ఎయిర్‌పోర్టు సమీపంలో నిర్వహించే హైందవ శంఖారావం సభను జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ ఆంధ్ర ప్రాంత ఉపాధ్యక్షుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ కోరారు. స్థానిక జాంపేటలోని వీహెచ్‌పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అజమాయిషీ లేకుండా హిందువులే దేవాలయాలను నిర్వహించుకొనేలా చట్టబద్ధమైన నిర్ణయం చేయాలని కోరారు. కార్యక్రమంలో భూపలపట్నం ఆత్మానందస్వామి, వీహెచ్‌పీ విభాగ్ సత్యనారాయణ, వై.సూర్యనారాయణ, జయశంకర్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా హైందవ శంఖారావం సభ కు మద్దతుగా షణ్ముఖ పీఠం పీఠాధిపతి శ్రీ స్కంధ స్వామి, బుద్ధ వెంకన్న ఆధ్వర్యంలో రాయుడుపాకల వరసిద్ధి వినాయక స్వామి ఆలయం నుంచి బైక్ ర్యాలీ చేపట్టారు. కంబాలచెరువు వివేకానంద సర్కిల్ వద్దకు చేరుకుని, వివేకానందకు పూలమాలలు వేశారు. స్కంధ స్వామి మాట్లాడుతూ హిందూ దేవాలయాలను ప్రభుత్వ ఆధీనం నుంచి విడిపిస్తూ, దేవాలయాల్లోని ఉద్యోగాల్లో ఉన్న అన్య మతస్థులను వేరే శాఖలకు బదిలీ చేయాలని, దేవాలయాల నిర్వహణా బాధ్యతలను హిందువులకే అప్పగించాలని కోరుతూ నిర్వహించనున్న హైందవ శంఖారావంలో ప్రతీ హిందువూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ సత్య శ్రీనివాస్, బుద్ధ అమ్మిరాజు, అల్లాడ చెంచారావు, అల్లాడ గణేష్, చీర్ల సీతారాయనాయుడు, పుల్లలచెరువు గోపాల్‌రెడ్డి, అందే మల్లేశ్వరరావు, అంద్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మురుగునీటి పారుదలకు చర్యలు


కోడిపుంజులతో సరదా పందెం వేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలోని 45,46 డివిజన్ల పరిధిలో లోతట్టు ప్రాంతం గాంధీరెడ్డినగర్‌లో మురుగునీటి పారుదల సమస్యను పరిష్కరిస్తానని ఇచ్చిన హామీని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ నిలబెట్టుకున్నారు. నగరపాలక సంస్థ నిధులు రూ.13 లక్షలతో రెండు జనరేటర్లను ఏర్పాటు చేసి మోటారుతో డ్రైనేజీ వాటర్‌ను పంప్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ జనరేటర్లను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే ప్రస్తుతం ఉన్న 5హెచ్‌పీ మోటారు స్థానంలో 10హెచ్‌పీ మోటారు ఏర్పాటు చేయించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కొయ్యల రమణ, తాడి మరియ, ధనరాజు, తురకల నిర్మల, పీడీపీ ప్రకాష్, కేబుల్ మురళీ, సందక లక్ష్మణరావు, పాల్గొన్నారు.

### ముగ్గుల పోటీలు

సంక్రాంతి పండుగ ముగ్గుల పోటీల సందడి రాజమహేంద్రవరంలో ప్రారంభమైంది. ఏటా మాదిరిగానే ఎమ్మెల్యే ఆదిరెడ్డి పదిరోజుల ముందే సంక్రాంతి ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. శుక్రవారం 1,2,7,9,10,11,50 డివిజన్లలో ముగ్గులు పోటీలు జరిగాయి. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని రంగవల్లులను వేశారు. ఈ పోటీలను తిలకించిన ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు ఈనెల 11న పుష్కరాలరేవు వద్ద నిర్వహించే సంక్రాంతి సంబరాల్లో బహుమతులు అందజేస్తామని చెప్పారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# వీధి కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు పెంచాలి: కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నగరంలో తిరిగే వీధి కుక్కలకు ఆపరేషన్స్ పెంచాలని మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. శుక్రవారం నగరంలో ఏబీసీ సెంటర్‌ను ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వీధి కుక్కలు బాగా పెరిగాయని, అందుకు తగ్గట్టుగా ఆపరేషన్స్ జరగాలన్నారు. ఆపరేషన్‌కు సంబంధించిన రికార్డులు సక్రమంగా లేకపోవడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనికి అదనంగా కెన్నెల్స్ ఏర్పాటు చేస్తున్నామని అందుకు అంచనాలు తయారు చేసి త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఎక్కువ ఆపరేషన్స్ నిర్వహించేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఈఈ మదర్షా ఆలీ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయండి

రంగంపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 17వ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని మండల యుటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రాంబాబు, ఐ.విజయ్‌బాబు కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఆదివారం నాడు ఉదయం 9 గంటలకు యుటీఎఫ్ సీనియర్ నాయకుడు కె.సత్తిరాజు, ఉభయ గోదావరి గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు జి.చిట్టిబాబు పతాకాలను ఆవిష్కరించి కార్యక్రమాలను ప్రారంభిస్తారన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగే సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు సభలు ప్రారంభిస్తారన్నారు. విశిష్ట అతిధిగా కేంద్ర మంత్రి కె.రామ్మోహన్నాయుడు, ముఖ్య అతిధులుగా ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, వాసంశెట్టి శుభాష్, కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయశ్రీనివాస్, కాకినాడ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, పంతం వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్సీలు కె.ఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, వి.గోపిమూర్తి, మాజీ ఎమ్మెల్సీ కె.వి.వి.సత్యనారాయణరాజు, కాకినాడ ఐడిఎల్ డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ పి.చిరంజీవికుమారి, జనవిజ్ఞాన వేదిక మాజీ అధ్యక్షుడు చెలికాని స్టాలిన్, కాకినాడ చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు గ్రంధి నారాయణరావు తదితరులు పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం ప్రజా చైతన్య సదస్సు, సాయంత్రం ఉద్యమ సదస్సు, సీనియర్ నాయకుల సందేశాలు, అనంతరం సత్కారాలు, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. సోమవారం సాహిత్య, విద్యా, మహిళా సదస్సు లు, ఉపాధ్యాయ ప్రదర్శన సాయంత్రం బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందన్నారు. మంగళవారం ప్రజాప్రతినిధుల సభ, 8న నూతన జనరల్ కౌన్సిల్ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. మహా సభల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు ఈ మూడు రోజులు ఓడి మంజూరు చేశారని వారు చెప్పారు.

# టీఎన్‌యుఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, టీఎన్‌యుఎస్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. సంఘ నాయకులైన కార్యదర్శులు కె.జయరాజు, రిమ్మలపూడి సత్యనారాయణమూర్తి, గౌరవ అధ్యక్షుడు వి.లజపతిరాయ్, యు.సత్యనారాయణ, డి.సురేష్, కృష్ణమూర్తి, మహిళా కార్యదర్శి కె.కృష్ణవేణి తదితర నాయకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యలను, వారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారాలను సూచించవలసిందిగా సంఘ నాయకులు కోరారు. విద్యాధికారి సానుకూలంగా స్పందించి త్వరలో పరిష్కరిస్తామని తెలిపారని జిల్లా అధ్యక్షుడు ఉండవల్లి సత్యనారాయణ తెలిపారు.

### ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా గోకవరం

గోకవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండవ ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా గోకవరం పోలీస్ స్టేషన్ నిలిచినట్లు ఎస్ఐ పవన్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్టేషన్ నిర్వహణ, ఉత్తమ ప్రజా సంబంధాల వ్యవహారాల్లో గోకవరం పోలీస్ స్టేషన్ రెండో స్థానంలో నిలిచిందన్నారు.

### రాజానగరం తహశీల్దారుగా అనంతలక్ష్మి సత్యవతిదేవి

రాజానగరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాజానగరం తహశీల్దారుగా జి.అనంతలక్ష్మి సత్యవతిదేవిని నియమిస్తూ కలెక్టర్ పి.ప్రశాంతి ఉత్తర్వులు జారి చేశారు. గతంలో ఈమె ఇక్కడ తహశీల్దారుగా పనిచేసి కలెక్టరేట్‌కు సూపరింటెండెంట్‌గా బదిలీపై వెళ్లారు. ఇక్కడ తహశీల్దారుగా పనిచేస్తున్న ఎన్.లక్ష్మిలావణ్యను కలెక్టరేట్‌కు బదిలీ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు.

### స్వతంత్ర స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆవిర్భావం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్వతంత్ర జనతా పార్టీ (రిపబ్లిక్) అనుబంధ విద్యార్థి సంఘం ఏర్పాటు చేశామని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బర్రే ఆనంద్ కుమార్ తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో స్టూడెంట్ వింగ్‌ను ఆవిష్కరించారు. స్వతంత్ర స్టూడెంట్స్ ఫెడరేషన్‌ను ప్రకటించి ఈ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గుదే వంశీని నియమించినట్లు తెలిపారు. సమావేశంలో జి.అమర్, విజయ్ కుమార్, కొత్తపల్లి మహేష్, బి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణ సేవా సమితికి విచ్చేసిన స్వామిజీలు

నిడదవోలు, జనవరి 3 (ఆంధ్ర జ్యోతి): నిడదవోలులోని శ్రీ రామ కృష్ణ సేవా సమితికి శుక్రవారం బేలూరు మఠం నుంచి స్వామీజీ సహితానందజీ మహరాజ్ విచ్చేసి సత్సంఘం కార్యక్రమం నిర్వహించారు. భక్తి సాధనపై అనుగ్రహ భాషణం చేశారు. ఆయన వెంట రాజమహేంద్రవరం నుంచి పరిజ్ఞానానందజీ మహరాజ్, రఘు వీరానందజీ మహరాజ్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎన్.రాంబాబు, ప్రత్తిపాటి సాగరం, సంకు వెంకట రత్నం, కొమ్మిన వెంకటేశ్వరరావు, గీతావాణి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల విద్యకు

# సావిత్రిబాయి కృషి

రాజానగరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త, విద్యావేత్త సావిత్రి బాయి పూలే 194వ జయంతిని రాజానగరం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి జిల్ల కోకన్వీనర్ మేకల లక్ష్మీపతిరావు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భారతదేశంలో మహిళల హక్కులు, విద్యను మెరుగుపర్చడంలో సావిత్రిబాయి పూలే కీలకపాత్ర పోషించారన్నారు. దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా, కావ్య రచనలు ప్రచురించిన తొలి భారతీయ మహిళగా, బాలికలకు, అణగారిన వర్గాలకు విద్యావకాశాలు కల్పించేందుకు ఎన్నో అవరోధాలు, అవమానాలు ఎదుర్కొన్నారన్నారు. సామాజిక సమానత్వం, దళిత, ఆదివాసీ, మైనారిటీ కులాల ఐక్యత కోసం అహర్నిశలు శ్రమించారన్నారు. కార్యక్రమంలో సత్తిబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**బిక్కవోలు:** పందలపాక ఉన్నత పాఠశాలలో భారతదేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయిని సావిత్రిభాయి పూలే జయంతి సందర్భంగా జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 11 మంది మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. ముందుగా సావిత్రిభాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పాఠశాల ఎస్‌ఎంసీ ఛైర్మన్ కొణాల సత్తిరాజు, పీడీ యువరాజారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బిక్కవోలు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పి.వీరప్రభాకరరావు అధ్యక్షతన సావిత్రిభాయి జయంతిని నిర్వహించారు.


బిక్కవోలు: పందలపాక హైస్కూల్లో మహిళా ఉపాధ్యాయులను సత్కరించిన దృశ్యం

- రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా కోకన్వీనర్ లక్ష్మీపతిరావు
- దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలి జయంతి
- పలుచోట్ల ఘన నివాళులు
- పలువురు మహిళా ఉపాధ్యాయులకు సత్కారం

**రాజమహేంద్రవరం కల్చరల్:** స్థానిక గణేష్ చౌక్ వద్ద బీసీ సంక్షేమ వసతి గృహంలో బీసీ సంఘం నాయకుడు బిల్డర్ చిన్న ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు చదువుకోవడమే నేరంగా భావించే నాటి ఛాందస వాదుల కాలంలో భర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో ఉపాధ్యాయినిగా మారారన్నారు. కార్యక్రమంలో ఇన్నీసుపేట కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ వైస్ ఛైర్మన్ గేడి అన్నపూర్ణరాజు, బూరా కనకలింగేశ్వరరావు, మాగంటి అరుణ్‌కుమార్, పడాల శ్రీను, రుక్కు, సానబోయిన మునేశ్వరరావు, కెభాస్కర్,వి.శ్రీనివాస్ పాల్గొన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభు త్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డీవీ రమణమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడారు. సావిత్రిబాయి కులవివక్ష నిర్మూలనకు, మహిళా హక్కుల కోసం పోరాడిన ధీర వనిత అని, ఆమె అడుగుజాలలో నడుచుకొని మహిళలు జీవితంలో అభివృద్ధిని సాధించాల న్నారు. కార్యక్రమంలో జి.మేడం, వై.స్వర్ణశ్రీ, జె.పద్మజ, కుసుమ గాంధీ, సరోజ, దుర్గ పాల్గొన్నారు.

**కడియం:** వేమగిరి బుద్ధవిహార్‌లో వ్యవస్థాపకుడు మహోదయ యాజరా సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్తూరి బాలనాగేశ్వరరావు, ప్రత్తిపాటి నల్లరాజు, బొర్రా సుబ్బారావు, అద్దేపల్లి నాగేశ్వరరావు, సూర్యావతి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

**రాజమహేంద్రవరం సిటీ:** స్థానిక నెహ్రూనగర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సానబోయిన రామారావు ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. హెచ్‌ఎం సత్యనారాయణ సావిత్రిబాయి గురించి వివరించారు. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఆదాయ పన్నుల శాఖ అధికారి మేడిశెట్టి తిరుమలకుమార్ విచ్చేసి మాట్లాడుతూ జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే, బీఆర్ అంబేడ్కర్‌లను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రామారావు మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ వంటివారి వల్లనే ఇప్పుడు మహిళలకు 33శాతం కేటాయింపులు లభిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జార్జి అంటోని, వైస్ చైర్మన్ ఎల్‌వీ ప్రసాద్,మట్టపర్తి సత్యనారాయణ, బొక్కా సత్యవెంకటప్రతాప్, కోనాల లాజర్ పాల్గొన్నారు. గాంధీ కస్తూర్బా వృద్ధాశ్రమంలో వృద్ధులకు బీసీ సంక్షేమం సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత దుప్పట్లు, పండ్లు, స్వీట్లు ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 3 తేదీని జాతీయ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లేపల్లి సుభాషిణి, భారతి, మానవ హక్కుల కమీషన్ సభ్యురాలు మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

### మంగారాణికి సావిత్రిబాయి పూలే అవార్డు


సినీ నటి రేణుదేశాయ్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న మంగారాణి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక నాగరాజా నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని మోటూరి మంగారాణికి సావిత్రిబాయి పూలే అవార్డు లభించింది. ఉపాధ్యాయినిగా ఆమె చేసిన సేవలను గుర్తించి భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా విజయవాడలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సినీనటి రేణుదేశాయ్ చేతులమీదుగా అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్‌తోపాటు రాజమహేంద్రవరంలో పలువురు అభినందించారు.

# న్యూడెమాక్రసీల విలీనమంటూ తప్పుడు ప్రచారం

## సీపీఐ ఎంఎల్ న్యూ డెమాక్రసీ కేంద్ర కమిటీ నాయకురాలు టాన్యా

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రెండు న్యూ డెమాక్రసీల విలీనం పేరుతో జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని సీపీఐ ఎంఎల్ న్యూ డెమాక్రసీ కేంద్ర కమిటీ నాయకురాలు పి.టాన్యా అన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం సీపీఐ ఎంఎల్ న్యూ డెమాక్రసీ ఉభయగోదావరి జిల్లాల కమిటీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. తప్పుడు ప్రచారాన్ని కమ్యూనిస్టు మేధావులు, విప్లవకారులు, ప్రజలు నమ్మవద్దని కోరారు. దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వ అమలు చేస్తున్న ఫాసిస్టు విధానాలను వర్గ పోరాటాల ద్వారానే ఎదుర్కొనగలం అన్నారు. ఒకే దేశం, ఒకే ప్రభుత్వం పేరుతో నియంతృత్వ విధానాలను అధికారిక విధానాలుగా ఏర్పాటు చేయాలని చూస్తున్నారని, ఈ ప్రజావ్యతిరేక విధానాలను అందరూ తిప్పికొట్టాలని కోరారు. సభకు న్యూడెమాక్రసీ పార్టీ నాయకులు ఎస్.కిరణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. జిల్లా పార్టీ నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, ప్రకాష్, భీమశంకర్, రాజశేఖర్, అనసూయ, చిట్టిబాబు మాట్లాడారు. భానుప్రసాద్, దినేష్, మణి, సూరిబాబు, బాలురెడ్డి పాల్గొన్నారు.

### 6న జాబ్‌మేళా

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సిటీలోని మోడల్ కెరీర్ సెంటర్ ప్రాంగణంలో ఈనెల 6న జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి హరీష్‌చంద్ర ప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పెరుమాళ్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాకు అక్సిస్ బ్యాంకు, ఎస్‌బీఐ, మెట్‌లైఫ్, లక్ష్మీ హ్యుండాయ్ ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఆయా సంస్థల్లోని వివిధ ఉద్యోగాల్లో పనిచేయడానికి 10వ తరగతి, ఐటీఐ నుంచి డిగ్రీ, పీజీ పూర్తి చేసిన 19 నుంచి 35 ఏళ్ల లోపు వయసున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు తమను సంప్రదించాలన్నారు.

ఆప్కో వస్త్రాలపై 30 శాతం వరకూ

### ప్రత్యేక ఆఫర్లు

మండల వాణిజ్య అధికారి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా ఆప్కో చేనేత వస్త్రాలపై 30 శాతం వరకూ ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు ఆప్కో రాజమహేంద్రవరం మండల వాణిజ్య అధికారి బి.హరిప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆప్కో విక్రయశాలల్లోనూ ఈ ప్రత్యేక ఆఫర్లు ఉంటాయని, అలాగే ఎంపిక చేసిన వస్త్రాలపై 50 శాతం డిస్కౌంటును అమలు చేస్తామని తెలిపారు. జిల్లా ప్రజలందరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి నేత కార్మికులను ఆదుకోవాలని కోరారు.


మంత్రి నారాయణరెడ్డిని కలిసిన రాష్ట్ర హ్యూమన్ రైట్స్ చైర్‌పర్సన్ తదితరులు

### మంత్రులను కలిసిన భవాని

రాజమహేంద్రవరం కల్చరల్ జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డిని, రాష్ట్ర హ్యూమన్ రైట్స్ చైర్‌పర్సన్ నల్లబోతుల భవాని గురువారం సచివాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వివిధ రకాల సమస్యలను గురించి చర్చించారు. బీసీ సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవితను మర్యాద పూర్వకంగా కలిశారు.

### అభివృద్ధి పనుల పరిశీలన

కడియం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఉపసర్పంచ్, టీడీపీ మండల అధ్యక్షులు వెలుగుబంటి రఘురామ్(నాని), పంచాయతీరాజ్ డీఈ రవి పరిశీలించారు. పడాలవారి వీధి మీదుగా రాజావీధి వరకు జరుగుతున్న సిమెంట్ రోడ్, డ్రైను పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జేఈ కలీం, కూటమి నాయకులు చిలుకూరి నాగేశ్వరరావు, తమ్మిశెట్టి ప్రసాద్, వెన్నపు అబ్బు, కోలా సురేష్ తదితరులు ఉన్నారు.

### సత్యదేవ నర్సరీలో తెలంగాణ ఫారెస్టు అధికారుల బృందం సందడి

కడియం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కడియపులంక పుల్లా చంటియ్య - సత్యదేవా నర్సరీని తెలంగాణ ఫారెస్టు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ సాగర్, రాజమహేంద్రవరం ఫారెస్ట్ హెడ్ ఆనందరావు, 26వ బ్యాచ్ ఫారెస్ట్ సెషన్ 40 మంది అధికారుల బృందం సందర్శించారు. నర్సరీ అధినేత పుల్లా పెదసత్యనారాయణ డీడీ సాగర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ ఉద్యానవన శిక్షకులకు, అడవుల అభివృద్ధికి ఈ ప్రదేశాన్ని చూడటం వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మెర్ల కృష్ణ, నర్సరీ యాజమాన్యం తదితరులు ఉన్నారు.

### పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

బిక్కవోలు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రంగాపురంలో పారిశుధ్య కార్మికులకు శుక్రవారం దుస్తులు, కుట్టుకూలీ సొమ్ములను సర్పంచ్ గండికోట వీరభద్రరావు, కూటమి నేతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కేతా ఏసురత్నం, కూటమి నేతలు నడింపిల్లి చిరంజీవిరాజు, కేతా రామకృష్ణ, కానేటి అప్పలస్వామి, చెల్లే జోష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం


చక్రద్వారబంధంలో దగ్ధమవుతున్న తాటాకిల్లు

రాజానగరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చక్రద్వారబంధం గ్రామంలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తాటాకిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన కోనే వీరబాబు కొన్నేళ్లుగా తాటాకు పాకలో నివసిస్తూ, కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్న సమయంలో ఇంటి విద్యుత్ సర్వీసు నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాప్తించడంతో తాటాకిల్లు దగ్ధమై పోయింది. ఇంట్లో దాచుకున్న బంగారు ఆభరణాలు, దస్తావేజులు, గృహోపకరణాలతో పాటు రూ.2లక్షల నగదు బూడిదైపోగా, కట్టుబట్టలతో మిగిలామని బాధితులు విలపించారు. రాజమహేంద్రవరం అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునే సరికే పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. మంటలు పరిసర ప్రాంతాలకు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు చర్యలు చేపట్టారు. ఇది తెలుసుకున్న నాసేన కోసం నావంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి చేరుకుని రూ.5వేల నగదు, 25 కిలోల బియ్యం అందజేసి, బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున ఆదుకుంటామని బాధితులకు భరోసా కల్పించారు.

# నరసింహస్వామికి తలనీలాలు సమర్పించిన మాజీ ఎమ్మెల్యే

కోరుకొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ లక్ష్మీనరసింహస్వామిని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సందర్శించి మొక్కు చెల్లించుకున్నారు. గతంలో ఆయన ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో ఐదేళ్లు కూడా ఆంగ్ల సంవత్సరం జనవరి 1 తరువాత నరసింహస్వామిని దర్శించుకుని తలనీలాలు ఇచ్చేవారు. అదే ఆచారాన్ని కొనసాగిస్తూ ఆయన స్వామి వారికి తలనీలాలు ఇచ్చారు. అనంతరం కాలినడకన కొండ మీదకు వెళ్లి లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అంతకుముందు కొండ దిగువన గల స్వామి వారి పాదాలపై బెల్లం పానకాన్ని పోసి పూజలు చేశారు. ఆయనతో పాటు పలువురు వైసీపీ నాయకులు తలనీలాలు ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, చాటపర్తి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు స్వామివారిని దర్శించుకున్న వారిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్కా రాంబాబు, వైసీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, అడబాల చినబాబు తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో ధనుర్మాస పూజలు

రాజమహేంద్రవరం కల్చరల్ జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నల్లమందు సందులోనున్న ఐశ్వర్యలక్ష్మి, పద్మావతీ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసం ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. శ్రీవారి 58వ సప్తాహ బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పంచాంగం వెంకటరంగాచార్యులు పూజలు చేశారు. ఈ కార్యక్రమం, ఆలయ ప్రెసిడెంట్ దేవిశెట్టి లక్ష్మీజనార్దన వరప్రసాద్, సెక్రటరీ గుర్రం శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగింది. ధనుర్మాసంలో తిరుప్పావై అభిషేకంలో భాగంగా స్వామివారికి దీప హారతులు, పుష్పమాలలు, ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. స్వామివారు సువర్ణ కిరీటంతో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

# త్యాగరాజ ఆరాధనోత్సవాలు ప్రారంభం

అనపర్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని శారదా సంగీత కళా సమితి ఆధ్వర్యంలో ఎనిమిది రోజులపాటు నిర్వహించే త్యాగరాజ ఆరాధనోత్సవాలు శుక్రవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. అనపర్తిలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించే సమితి 26వ ఆరాధన ఉత్సవాలను గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉత్సవాల్లో మొదటి రోజున విద్వాన్ మోదుమూడి సుధాకర్ ఆలపించిన గాత్రాలు ఆకట్టుకున్నాయి. ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు తమలంపూడి చిన ఆదిరెడ్డి, రఘునాథరెడ్డి, మేడపాటి చెల్లారెడ్డి, కర్రి సాంబశివరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, సురేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.


త్యాగరాజ ఆరాధనోత్సవాలకు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న దృశ్యం

### భక్తి ప్రపత్తులతో తిరుప్పావై పాశురాలు

రాజానగరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని రాజానగరంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో తిరుప్పావై పాశురాలను మహిళా భక్తులు భక్తశ్రద్ధలతో ఆలపిస్తున్నారు. గ్రామానికి చెందిన ఆర్యవైశ్యులు ప్రతి ఏడాది ఆలయంలో గోదారంగనాధులుస్వామి కల్యాణ క్రతువును నిర్వహించడం పరిపాటిగా వస్తోంది. గత నెల 17న ప్రారంభమైన పాశురాలు పరంపర రోజుకొకటి వంతున చదవడంతో పాటు వచన రూపంలో వివరిస్తున్నారు. ఈ నెల 13న గోదారంగనాధుల కల్యాణం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా విష్ణు సహస్రనామం, గోదాదేవి అష్టోత్తరం, గోదాదేవి పాశురాలు ఆలపిస్తున్నారు. పాశురం రోజున 108 పాత్రలతో క్షీరాన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

### 'అభివృద్ధి నిల్...అవినీతి ఫుల్'

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి

కోరుకొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాజానగరం నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వ పాలనలో ఎక్కడ చూసినా అవినీతి ఫుల్‌గా కనిపిస్తున్నదని అభివృద్ధి మాత్రం శూన్యమని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విమర్శించారు. శుక్రవారం ఆయన కోరుకొండలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి కోట్లాది రూపాయలు నియోజకవర్గ అభివృద్ధికి మంజూరు చేయించానన్నారు. వాటిలో కొన్ని పనులు పూర్తికాగా మరికొన్ని పనులు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించామన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటికి సంబంధించిన పనుల విషయంలో అంగుళం కూడా ముందుకు కదల్లేదన్నారు. దోపిడీయే అజెండాగా పాలన సాగుతుందని విమర్శించారు. ఇప్పటికే ప్రజల్లోనే తిరుగుబాటు మొదలైందన్నారు. సమావేశంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

### బంగారు వస్తువుల చోరీ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం శేషయ్యమెట్టలో ఒక ఇంట్లో గుర్తు తెలియని దొంగలు 48 గ్రాముల వస్తువులు అపహరించుకుపోయారని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసు కథనం ప్రకారం...రాజమహేంద్రవరం శేషయ్యమెట్టకు చెందిన వీరబాబు కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం ఆయన ఇంటి నుంచి డ్యూటీకి వెళ్లారు. కొంతసేపటి తర్వాత అతని భార్య, కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి చర్చ్‌కు వెళ్లారు. వారు మధ్యాహ్నం ఇంటికి చేరుకునే సరిగి తాళం పగులకొట్టి ఉంది. బీరువాలో పెట్టిన 48 గ్రాముల గోల్డ్ కనిపించలేదు. చోరీపై బాధితుడు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## నేడే 'ఆంధ్రజ్యోతి' ముగ్గుల పోటీ



సిద్ధమైన శ్రీ షిర్డీ సాయి విద్యానికేతన్ గ్రౌండ్

రాజమహేంద్రవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీ శనివారం జరుగనుంది. ప్రతి ఏటా సంక్రాంతికి ముత్యాల ముగ్గుల పండుగను ఘనంగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది కూడా ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్ .. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) నేతృత్వంలో జరుగుతాయి. దీనికి లోకల్ స్పాన్సరర్‌గా భవానీ చారిటబుల్ ట్రస్ట్ (రాజమండ్రి) తరపున సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు. రాజమహేంద్రవరం ఆల్ బ్యాంక్ కాలనీలో ఉన్న శ్రీ షిర్డీ సాయి విద్యానికేతన్ గ్రౌండ్‌లో శనివారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ముత్యాల ముగ్గుల పోటీలు ప్రారంభిస్తారు. పోటీల్లో పాల్గొనే మహిళలు ఒక గంట ముందే ప్రాంగణానికి చేరుకోవాలి. విజేతలకు అదే రోజు బహుమతులు అందజేస్తారు. మొదటి బహుమతి రూ.6 వేలు, రెండో బహుమతి రూ.4 వేలు, మూడో బహుమతి రూ.3 వేల నగదు అందజేస్తారు. మరో పది మందికి కన్సొలేషన్ బహుమతులు ఇస్తారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఏదొక చిరుకానుక ఇస్తారు. పోటీల్లో మహిళలు మాత్రమే పాల్గొనాలి. ముగ్గు, రంగులు, పువ్వులు, వగైరా సామగ్రి ఎవరికి వారే తెచ్చుకోవాలి. చుక్కల ముగ్గులు మాత్రమే పెట్టాలి. జడ్జిలు అడిగినప్పుడు ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు అని చెప్పగలగాలి. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం 2 గంటలు ఉంటుంది. ఈ మేరకు కళాశాల ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.

## కళాశాలకు బయలుదేరి.. అంతలోనే కన్నుమూసి

ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొని విద్యార్థి మృతి, మరొకరికి తీవ్రగాయాలు

## హైవేపై లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా..

బైక్ హ్యాండిల్ లారీకి తగిలి యువకుడి మృతి.. మరో యువకుడికి గాయాలు

## దుద్దుకూరు హైవేపై డివైడర్‌ను ఢీకొని విద్యార్థి మృతి

8



## సముద్రంలో అలవోకగా..

వైజాగ్ నుంచి కాకినాడకు 150 కిలోమీటర్లు మహిళా స్విమ్మర్ ఈత

సర్పవరం జంక్షన్ (కాకినాడ) జనవరి 3(ఆంధ్రజ్యోతి): కేవలం ఆరు రోజుల్లో రోజుకు 20-30 కిలోమీటర్లు వైజాగ్ నుంచి కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు బంగాళాఖాతంలో ఈతకొట్టి, సముద్రంలో 150 కిలోమీటర్ల లక్ష్యాన్ని అవలీలగా ఈదేసి కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన 52 ఏళ్ల మహిళా స్విమ్మర్ గోలి శ్యామల అరుదైన రికార్డును సొంతంచేసుకున్నారు. డిసెంబరు 28న విశాఖ ఆర్కే బీచ్‌లో ఎంపీ భరత్ సముద్రంలో ఈ యాత్రకు జెండా ఊపి ప్రారంభించగా, శుక్రవారం జనవరి 3న కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు ఈదుకుంటూ లక్ష్యాన్ని చేరుకున్నారు. సుదీర్ఘ సముద్రంలో 150 కిలోమీటర్లు ఈత ఈదిన తొలి ఆసియా స్విమ్మర్‌గా శ్యామల అరుదైన రికార్డు సాధించారు.

## నేటి నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి వెల్లడి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 15 ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈనెల 4వ తేదీ శనివారం నుంచి మధ్యాహ్న భోజన పథకం ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి వెల్లడించారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ జిల్లా మంత్రి దుర్గేష్, ఇతర శాసనసభ్యులు ఆయా నియోజకవర్గాల్లో ఈ పథకాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకుంటున్న 5,425 మంది విద్యార్థినీవిద్యార్థులకు ఈ మధ్యాహ్న భోజన పథకం అమలుచేయడం జరుగుతుందని, ఈమేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.

## సవాళ్లు అధిగమించి ఉత్తమ ఫలితాలు సాధించాలి

హాస్టల్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి3 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థినీవిద్యార్థులు లక్ష్యాల సాధనలో సవాళ్లను అధిగమించి ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆకాంక్షించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా అభినందనలు తెలిపేందుకు వచ్చినవారు అందజేసిన పుస్తకాలను జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు 322 సెట్లను అందజేశామని తెలిపారు. కొత్త సంవత్సరంలో ఒక మంచి కార్యక్రమంలో భాగస్వాములు కావడం ద్వారా ప్రతి ఒక్కరూ తమ వంతుగా సామాజిక బాధ్యత చూపాలని పేర్కొన్నారు. కాగా కలెక్టర్ ఆదేశాలమేరకు వసతిగృహాల్లోని పిల్లలకు 322 సెట్స్‌తో పాటు కలెక్టర్ పంపిన సందేశాన్ని, శుభాకాంక్షలను అందజేశామని జిల్లా సాంఘిక సంక్షేమాధికారి సందీప్ తెలిపారు.



సీఎం చంద్రబాబుతో భేటీ అయిన మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల, ఆదిరెడ్డి, బత్తుల

# బాబుతో భేటీ!

- పేపరుమిల్లు కార్మికులకు అన్యాయం జరగనివ్వను
- ఎంపీ, ఎమ్మెల్యేల బృందానికి సీఎం చంద్రబాబు స్పష్టీకరణ
- ఉన్నత స్థాయి కమిటీ నియమించాలని అడిషనల్ సెక్రటరీకి సీఎం ఆదేశం
- సీఎంతో భేటీ అయిన మంత్రి కందుల, ఎంపీ పురందేశ్వరి
- సీఎంను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు గోరంట్ల, ఆదిరెడ్డి, బత్తుల
- పేపరుమిల్లు కార్మిక వర్గాల్లో ఆనందం

రాజమహేంద్రవరం/అర్బన్,జనవరి3 (ఆంధ్రజ్యోతి): కొద్దికాలంగా వివాదాస్పదంగా మారిన రాజమండ్రి పేపరుమిల్లు సమస్యలను చక్కదిద్దే పనిలో కూటమి ప్రజాప్రతినిధులు నిమగ్నమయ్యారు. ప్రధానంగా కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఇక్కడ ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవడమేగాకుండా నేరుగా ముఖ్యమంత్రితోనే భేటీ అయ్యారు. కార్మికులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రాజమండ్రి పేపరుమిల్లు కార్మికులకు అన్యాయం జరగనీయను.. వారికి న్యాయం చేస్తామని స్పష్టంచేశారు. అంతేకాదు ఈ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీని నియమించాలని తక్షణం అడిషనల్ సెక్రటరీని ఆదేశించారు. జీతాలు పెంచకపోవడం, కార్మికులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యల గురించి రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ శుక్రవారం అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడితో భేటీ అయ్యారు. పేపరు మిల్లులో చాలా కాలంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను, యాజమాన్య వైఖరిని వారు సీఎంకు వివరించారు. సమస్య ఎందుకు వచ్చిందని, ఇప్పటి వరకూ ఎన్నిసార్లు వేతన అగ్రిమెంట్లు జరిగాయని చంద్రబాబు వారిని అడిగారు. వైసీపీ హయాంలో వేతన ఒప్పందం మీద జాప్యం జరిగిందని, గతంలో జేసీఎల్ సమక్షంలో ప్రజాప్రతినిధుల సమక్షంలో వేతన ఒప్పందం మీద చర్చలు జరిగాయని వారు చెప్పారు. ముఖ్యంగా గత డిసెంబరు 24న జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సమక్షంలో జరిగిన సమావేశంలో రూ.3,500 మించి జీతం పెంచడం తమ చేతుల్లో లేదని పేపర్ మిల్లు మేనేజ్‌మెంట్ తేల్చేసిన విషయాన్ని కూడా వారు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకుని వెళ్లారు. కానీ గతంలో చేసిన ఒప్పందంలో పేపరు మిల్లు కార్మికులకు రూ.9 వేలు పెరిగిందని సీఎం చంద్రబాబుకు వారు వివరిస్తూ, ఈసారి కూడా కార్మికులకు న్యాయం చేయవలసి ఉందని వారు సీఎంకు వివరించారు. దీనిపై చంద్రబాబు పేపరుమిల్లు యాజమాన్యం తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కార్మికులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనీయమని, న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. సమస్య పరిష్కారం కోసం ఉన్నత స్థాయి కమిటీని నియమించాలని అడిషనల్ సెక్రటరీ కార్తికేయ మిశ్రాను సీఎం చంద్రబాబు నాయుడు అక్కడకక్కడే ఆదేశించారు. ఈ నేపథ్యంలో పేపరు కార్మిక వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. తమ సమస్య పరిష్కారానికి జిల్లా ప్రజాప్రతినిధులు వీరు చేస్తున్న కృషికి, సీఎం చంద్రబాబు స్పందన పట్ల కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. కొద్ది రోజుల్లోనే తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశాభావంతో ఉన్నారు.

## ఆగిన డీసిల్టేషన్ ర్యాంపులు



కొవ్వూరు వద్ద ఉన్న ఇసుక ర్యాంపులో ఇసుకతీతను నిలిపివేసిన దృశ్యం

### అనుమతి కోసం ఎదురుచూస్తున్న బోట్స్‌మన్ సొసైటీలు

రాజమహేంద్రవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అఖండ గోదావరిలో డీసిల్టేషన్ పేరిట జిల్లాలో బోట్సుమన్ సొసైటీల ద్వారా తీసే ఇసుకతీత ఆగింది. గత డిసెంబరు 31వరకే అనుమతి ఉన్నప్పటికీ, 2వతేదీ వరకూ చాలాచోట్ల ఇసుక తీశారు. దీంతో అధికారులు రంగంలోకి దిగి మొత్తం బోట్స్‌మన్ సొసైటీ ర్యాంపులన్నీ ఆపేశారు. రాజమండ్రి, కొవ్వూరు వైపు అధికంగా బోట్స్‌మన్ సొసైటీల ద్వారా ఇసుక తీస్తున్న సంగతి తెలిసిందే. ఈ సొసైటీలు ఇంకా అనుమతులు కోసం చూస్తున్నాయి. వీటికి ఎప్పుడు అనుమతి ఇస్తారనేది స్పష్టత లేదు. కానీ ఈ సొసైటీల మీద ఇప్పటికే ఆరోపణలు ఉన్నాయి. ఎక్కువ డబ్బు వసూలు చేస్తున్నారనే ప్రచారం ఉంది. కొవ్వూరులో వాడపల్లి, విజ్జేశ్వరం వైపు వాహనాలు కూడా రాకపోకలు సాగించని విధంగా రోడ్డంతా లారీలతో నింపేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికార పార్టీకి చెందిన ద్వితీయస్థాయి నేతలు కొందరు ఇక్కడ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీకి చెందిన ఓ సీనియర్ నేత గత రెండు నెలల నుంచి ఇక్కడ పరిస్థితిని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకుని వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. కానీ బోట్సుమన్ సొసైటీల ద్వారా కూటమి కార్యకర్తలు కూడా సొసైటీలను పొందడం వల్ల కొంతమేర లబ్ధి పొందుతున్నారు. దీంతో అనుమతి వస్తుందనే ధీమాతో ఉన్నారు. ప్రస్తుతం ఓపెన్ రీచ్‌ల ద్వారానే ఇసుకతీత జరుగుతోంది.

## నేడు గేమ్‌ఛేంజర్ సందడి

పవన్‌కల్యాణ్, రామ్‌చరణ్ రాక.. భారీ ఏర్పాట్లు.. ట్రాఫిక్ మళ్లింపు

రాజమహేంద్రవరం, జనవరి3(ఆంధ్రజ్యోతి): ప్రముఖ హీరో రామ్‌చరణ్ నటించిన 'గేమ్‌ఛేంజర్' సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహణకు భారీఏర్పాట్లు సిద్ధం చేశారు. వేమగిరి సమీపంలోని జాతీయ రహదారి పక్కన గతంలో టీడీపీ మహానాడు సభ జరిగిన స్థలంలో ఏర్పాట్లుచేస్తున్నారు. ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వస్తున్నారు. సుమారు 6 గంటలకు విమానాశ్రయానికి వచ్చి, అక్కడ నుంచి షెల్టన్ హోటల్‌కు చేరుకుంటారు. అక్కడ కాస్త విశ్రాంతి తీసుకున్న తర్వాత ఈవెంట్ స్థలానికి చేరుకుంటారు. రాత్రికి తిరిగి విమానంలో తిరిగి వెళతారు. ఆయనతోపాటు రాంచరణ్, హీరోయిన్, దర్శకులు, నిర్మాతలు రానున్నారు. 1100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ నరసింహకిశోర్ తెలిపారు. ఈవెంట్ స్థలం వైపు హైవేలు వాహనాలు వెళ్లకుండా బొమ్మూరు నుంచి దారి మళ్లించారు. బొమ్మూరు రాజవోలు మీదుగా కడియం సమీపంలో పేపరుమిల్లు దారి నుంచి కడియం మీదుగా వేమగిరి, రావులపాలెం వైపు ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను మళ్లించారు. కార్లు, ద్విచక్రవాహనాలను బాలాజీపేట, మీదుగా ధవళేశ్వరం వైపు మళ్లించారు. రావులపాలెం వైపు వచ్చే వాహనాలను అదే మార్గాలకు మళ్లించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు పలు సమస్యలను వివరిస్తున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

## ఎరువుల కొరతపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఎమ్మెల్యే నల్లమిల్లి విజ్ఞప్తితో వెంటనే ఆదేశాలు

అనపర్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రైతులు యూరియా, డీఏపీ కొరతతో పడుతున్న ఇబ్బందులను అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సీఎం చంద్రబాబుకి వివరించడంతో ఆయన వెంటనే స్పందించారు. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసిన ఎమ్మెల్యే ఉమ్మడి జిల్లాలో యూరియా డీఏపీ కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బహిరంగ మార్కెట్‌లో ఎరువుల ధర పెరగక ముందే కొరత తీర్చాల్సిన అవసరం ఉందని వివరించారు. దీనికి స్పందించిన ముఖ్యమంత్రి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎరువుల కొరత రాకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

### వంతెన నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు

బిక్కవోలు, జనవరి3(ఆంధ్రజ్యోతి): కాకినాడ కాలువపై కొంకుదురు వద్ద ఉన్న అసంపూర్తి వంతెన పూర్తి చేయడానికి సీఎం చంద్రబాబు రూ.2 కోట్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం సీఎంను ఎమ్మెల్యే కలసి 2012-13లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గోదావరి కాలువలపై చేపట్టిన నాలుగు వంతెనలు అసంపూర్తిగా ఉన్నాయని, కొంకుదురు వంతెన ప్రాముఖ్యం కాబట్టి నిధులు మంజూరుచేయాలని సీఎంను కోరగా నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే తెలిపారు.

# రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం


సభలో మాట్లాడుతున్న తహశీల్దార్ అచ్యుతకుమారి

పెరవలి, జనవరి3(ఆంధ్రజ్యోతి): రీ సర్వే ద్వారా రైతుల భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కారమవుతాయని తహశీల్దార్ అచ్యుతకుమారి పేర్కొన్నారు. ఖండవల్లిలో భూముల రీ సర్వే కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎప్పుడో జరిగిన సర్వే అనంతరం భూముల కొనుగోలు, అమ్మ కా లు, వారసత్వంగానూ, అనేక మార్పులు వచ్చాయని దాని వల్ల సరి హద్దులు, భూ విస్తీర్ణంలో సమస్యలు, ఆన్‌లైన్‌లో ఇబ్బందులు సరి చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వేకు గ్రామంలో రైతులంతా సహకరించాలన్నారు. ఈ నెల 3న ప్రారంభమైన ఈ కార్యక్రమం 18వరకు కొనసాగుతుందన్నారు. 11 టీమ్‌లు ఈ గ్రామంలో సర్వే నిర్వహిస్తాయని ఒక్కో టీమ్‌లోఇద్దరు విలేజ్ సర్వేయర్‌లు, ఒక వీఆర్వో, ఒక వీఆర్ఏ ఉంటారని ఒక్కొక్క టీమ్‌కు 250 నుంచి 300 ఎకరాలు చొప్పున సర్వే నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థాయి అధికారులు, సర్పంచ్ నాగరాజు, ఉపసర్పంచ్ అతికాల రామకృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బేడ, జంగాలకు సరైన గుర్తింపునివ్వండి

**తహశీల్దార్‌కు ఆ సంఘ నాయకుల వినతి**


తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న జంగం కులస్థులు

పెరవలి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కులపరంగా తమకు సరైన గుర్తింపు లేదని తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెరవలికి చెందిన బేడ (బుడగ), జంగం కులానికి చెందిన పలువురు తహశీల్దార్ అచ్యుతకుమారికి వినతిపత్రం అందించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ ఇటీవల ఎస్సీ వర్గీకరణపై జనాభా లెక్కలు సేకరించారని దానికి సంబంధించి ప్రతీ గ్రామంలో సోషల్ ఆడిట్ జరుగుతోందన్నారు. పెరవలి పంచాయతీలో జాబితా పరిశీలించగా జాబితాలో ఎస్సీ 59 ఉప కులాల్లో సీరియల్ నెంబరు 9లో తమ కులానికి చెందిన వివరాలు ఉండాల్సి ఉండగా అవి లేవన్నారు. తాము పెరవలిలో వంద కులాలు వారము 60 ఏళ్లుగా నివశిస్తున్నామని, తెలంగాణ నుంచి వలస వచ్చామన్నారు. ఎస్సీ ఉప వర్గీకరణలో తమ కులాన్ని కూడా చేర్చి న్యాయం చేయాలన్నారు. పలు ఎన్నికల్లో రాజకీయ నాయకులు తమ ఓట్లు కోసం వస్తున్నారు కాని తమ సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పేర్ల నాగులు, ఐ.సుబ్రహ్మణ్యం, కొండయ్య, శ్రీను పాల్గొన్నారు.

# రామకృష్ణ సేవా సమితికి విచ్చేసిన స్వామిజీలు


రామకృష్ణ సేవా సమితి ప్రాంగణంలో స్వామిజీలు

నిడదవోలు, జనవరి 3 (ఆంధ్ర జ్యోతి): నిడదవోలులోని శ్రీ రామకృష్ణ సేవా సమితికి శుక్రవారం బేలూరు మఠం నుంచి స్వామీజీ సహితానందజీ మహరాజ్ విచ్చేసి సత్సంగం కార్యక్రమం నిర్వహించారు. భక్తి సాధనపై అనుగ్రహ భాషణం చేశారు. ఆయన వెంట రాజమహేంద్రవరం నుంచి పరిజ్ఞానానందజీ మహరాజ్, రఘువీరానందజీ మహరాజ్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్.రాంబాబు, ప్రత్తిపాటి సాగరం, సంకు వెంకటరత్నం, కొమ్మిన వెంకటేశ్వరరావు, గీతావాణి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

# వాసవి జాగృతి పశ్చిమ చార్టర్ గవర్నర్‌గా కాళీకృష్ణ


కాళీకృష్ణకు నియామకపత్రాలు అందజేస్తున్న వేణుగోపాల్

దేవరపల్లి, జనవరి 3(ఆంధ్ర జ్యోతి): వాసవి జాగృతి ఇంటర్నేషనల్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా చార్టర్ గవర్నర్‌గా దేవరపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ పారి శ్రామికవేత్త శ్రీకాకుళపు కాళీకృష్ణ నియమితులయ్యారు. శుక్రవారం వాసవి జాగృతి ఇంటర్నేషనల్ అధ్యక్షుడు త్రివేది వేణుగోపాల్ నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కాళీకృష్ణ మాట్లాడుతూ 30 ఏళ్లుగా వ్యాపార, వాణిజ్య రంగాలతో పాటు సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆర్య వైశ్యసేవా సంఘ అధ్యక్షునిగా వివిధ హోదాల్లో సేవలందించారని రానున్న రోజుల్లో ప్రజలకు మరిన్ని సేవలందిస్తానన్నారు. అలాగే ఏటా పేదలకు, వృద్ధాశ్రమాలకు దుస్తులు, ఆర్థిక సహకారం అందిస్తున్నానన్నారు. తన నియామకం పట్ల చార్టర్ ప్రతినిధులకు కాళీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

# డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

**మరొకరికి స్వల్పగాయాలు**



మృతుడు సాయిరాజ్, ఫైల్

దేవరపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలం దుద్దుకూరు జాతీయ రహదారిపై మోటార్‌సైకిల్ డివైడర్‌ను ఢీకొని ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. విజయవాడ వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న మోటార్ సైకిల్‌పై తేజేస్ సాయిరాజ్, స్నేహితుడు పొట్రు లోకేశ్ వెళ్తున్నారు. బందపురం జాతీయ రహదారి వద్దకు వచ్చే సరికి ఆర్‌టీసీ బస్సును క్రాస్ చేసే సమయంలో వేగంగా డివైడర్‌ను ఢీకొనడంతో తేజేస్ సాయిరాజ్(20) తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లోకేశ్‌కు స్వల్పగాయాలయ్యాయి. మృతుడు విజయవాడ శివారు కానూరు గ్రామానికి చెందినవాడు. అతడు ప్రయివేటుగా డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మృతదేహాన్ని గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మృతుడి తండ్రి జక్కం శేఖర్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

# పొగాకును మార్కెట్‌కు అనుగుణంగా పండించండి


సమావేశంలో మాట్లాడుతున్న పొగాకుబోర్డు విస్తర్ణాధికారి దామోదర్

గోపాలపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా పొగాకును పండించి గిట్టుబాటు ధర సాధించుకోవాలని పొగాకుబోర్డు విస్తర్ణాధికారి జీ.దామోదర్ అన్నారు. స్థానిక పొగాకువేలం కేంద్రంలో బోర్డు ప్రారంభించి 50సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వర్జీనియా పొగాకు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో శాస్త్రవేత్తలు సూచించిన ఎరువులు, పురుగు మందులు మాత్రమే వాడాలన్నారు. రసాయనిక ఎరువుల వినియోగం పూర్తిగా తగ్గించి సేంద్రీయ ఎరువులతో సాగు చేయాలన్నారు. దీంతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. పొగాకుబోర్డు రీజనల్ మేనేజర్ జీఎల్‌కే.ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీటీఆర్ఐ శాస్త్రవేత్త సుబ్బయ్య, పొగాకుబోర్డు ఆక్షన్ మేనేజర్ కేవీ రామాంజనేయులు, వేలం నిర్వహణాధికారి అమల్ది శ్యామ్, దేవరపల్లి ఏఎస్‌కే హేమస్మిత, కొయ్యలగూడెం బోర్డు వేలం నిర్వహణాధికారి మార్గరేట్, జంగారెడ్డిగూడెం 1, 2 వేలం నిర్వహణాధికారులు శ్రీహరి, సురేంద్ర, రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఇల్లూరి రాంబాబు, దుగ్గిరాల రాంబాబు, శేషగిరి, ఉండవల్లి సత్యనారాయణ, నందమూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చాగల్లు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేసారు. మండలంలో పది మందికి మంజూరైన రూ.5,95,655 విలువ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆళ్ళ హరిబాబు, నాదెళ్ళ శ్రీరామ్, బొల్లిన శివ నాగేంద్ర, అబ్బూరి సీతారామాంజనేయులు, పత్తిపాటి శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్టు

కొవ్వూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చిన్నాన్నపై కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. కొవ్వూరు మండలం నందమూరు గ్రామంలో ఈ నెల 2వ తేదీన భూ తగాదాల నేపథ్యంలో చిన్నాన్న గన్నమని లక్ష్మణరావు, భార్య కృష్ణవేణిలపై లక్ష్మణరావు అన్నయ్య వెంకటరామారావు కొడుకు గన్నమని సతీష్‌చౌదరి కొడవలితో దాడి చేశాడు. గాయాలైన లక్ష్మణరావు, కృష్ణవేణిల రాజమహేంద్రవరంలో చికిత్స పొందుతున్నారు. సతీష్‌చౌదరిని శుక్రవారం పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

## కిషోరి వికాసంపై అవగాహన

తాళ్లపూడి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కిషోర వికాసం కార్యక్రమంపై కిషోర బాలికలకు అవగాహన కల్పించే కార్యక్రమం అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు రిసోర్స్‌పర్సన్స్ క్రాంతి, రాజ్‌కుమార్ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సీడీపీవో మమ్మి మాట్లాడారు. బాల్య వివాహాలు జరగకుండా జాగ్రత్తల తీసుకోవాలని సూచించారు.

# మార్చి నాటికి పన్నులు 100% వసూలు చేయాలి



సమావేశానికి హాజరైన మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది

- కమిషనర్లు చెక్ చేయకుండా డేటా ఆర్డీ కార్యాలయానికి పంపించొద్దు
- మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగనరసింహరావు
- కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలోని 6 మున్సిపాల్టీలపై సమీక్ష

కొవ్వూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మార్చి నాటికి ఆస్తి పన్ను, కుళాయి పన్ను, ఖాళీస్థలాల పన్నులు వంద శాతం వసూలు చేయాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ సిహెచ్. నాగనరసింహరావు అన్నారు. కొవ్వూరు లిటరరీ క్లబ్ కళ్యాణ మండపంలో శుక్రవారం కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలోని 6 మున్సిపల్ కమిషనర్లు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపాల్టీల్లో ఆస్తిపన్ను, కుళాయి పన్ను, పారిశుద్యం, ఇంటింటా చెత్త సేకరణ, వీధి దీపాల నిర్వహణ, తడి, పొడి చెత్త వేరుచేయడం, ట్రేడ్ లైసెన్సులు, తాగునీటి సరఫరా, పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారం, సచివాలయ కార్యదర్శుల అటెండెన్స్, వంటి అంశాలపై మున్సిపాల్టీల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం టౌన్ ప్లానింగ్, మెప్మా సిబ్బందితో సమీక్ష చేశారు. నాగనరసింహరావు మాట్లాడుతూ ప్రతినెలా జిల్లాల వారీగా మున్సిపాల్టీల ప్రగతిపై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్లు సమీక్షా సమావేశాలకు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. కొన్ని మున్సిపాల్టీలు సచివాలయ కార్యదర్శుల అటెండెన్స్‌లోను, పన్నుల వసూలు, కొత్త అసెస్‌మెంట్సు, ఎడిషన్ అల్ట్రేషన్స్‌లో పూర్‌గా ఉన్నాయన్నారు. మున్సిపాల్టీల డేటాను కమిషనర్ చెక్ చేయకుండా ఆర్డీ కార్యాలయానికి పంపించ వద్దన్నారు. మండపేట, రామచంద్రాపురం, ముమ్మిడివరం మున్సిపాల్టీలు నాన్ రెసిడెన్స్ ప్రాంతాలని, కమర్షియల్ ప్రాంతాల్లో ఆదాయం పెంచుకోవడానికి కౌన్సిల్ ఆమోదంతో గెజిట్ పబ్లికేషన్ చేసుకుని ఆదాయం పెంచుకోవాలన్నారు. తదుపరి సమావేశానికి గెజిట్ పబ్లికేషన్ చేయకపోతే కమిషనర్లు సంజాయిషి ఇవ్వవలసి ఉంటుందన్నారు. ఇంటింటా సేకరించిన చెత్తను తగలబెట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ అడ్మిన్, ప్లానింగ్, ఎమినిటీ, శానిటేషన్ సెక్రటరీలు నిర్ణీత సమయానికి విధులకు హాజరుకావాలన్నారు.ఆన్‌లైన్‌లో హాజరు తనిఖీ చేస్తామన్నారు. జనవరి నెలాఖరులోగా మున్సిపాల్టీల్లో గుంతలు పడిన రహదారుల మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించాని, లేకుంటే మున్సిపాల్టీల నిర్వహణ, అభివృ ద్ధి కుంటుపడుతుందన్నారు. ఆస్తి పన్ను, వడ్డీ మాఫీ ఉండదన్నారు. తడి, పొడిచెత్త వేరుచేసి అందించి, సహకరించాలన్నారు. ప్రతినెల సమీక్షా సమావేశాలు కొనసాగుతాయన్నారు. అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రపురం, మండపేట, నిడదవోలు, కొవ్వూరు మున్సిపాల్టీల కమిషనర్లు, ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సంక్రాంతి పండుగ సాంప్రదాయ పద్ధతిలో జరుపుకోవాలి

**ఆర్డీవో సుస్మితా రాణి**

తాళ్లపూడి, జనవరి 1 ( ఆంధ్రజ్యోతి ) రానున్న సంక్రాంతి పండుగ సాంప్రదాయ పద్ధతిలో జరుపుకోవాలని పందాలు, జూదాల పట్ల పేద, మధ్య తరగతి ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆర్డీవో సుస్మితా రాణి అన్నారు. సాదారణ తనిఖీలలో భాగంగా శుక్ర వారం ఆర్డీవో సుస్మితారాణి తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేశారు. కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కోడి పందాలు, జూదాలు జరుగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. బోట్‌మెన్ సొసైటీల ఆధ్వర్యంలో ఇసుక ర్యాంపులు అందుబాటులోకి తేవడానికి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం తహశీల్దార్ రవీంద్రనాథ్, డీటీ భారతి, ఆర్ఐ రామకృష్ణ చూపించిన రెవెన్యూ రికార్డులను ఆమె పరిశీలించారు.

## బీజేపీ నిడదవోలు అధ్యక్షుడిగా ప్రమోద్‌కుమార్

నిడదవోలు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నిడదవోలు పట్టణ అధ్యక్షుడిగా మోర్త ప్రమోద్‌కుమార్‌ను నియమించినట్టు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. పార్టీ పెద్దల ఆదేశాల మేరకు పట్టణంలో పార్టీని బలోపేతం చేస్తానని పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ భారతీయ జనతాపార్టీ కార్యక్రమాలను వేగవంతం చేస్తానన్నారు.

## పోలీస్ ఔట్ పోస్ట్ శుభ్రం



నిడదవోలు, జనవరి 3 (ఆంధ్ర జ్యోతి): ఆంధ్రజ్యోతి వార్తకు యంత్రాంగం స్పందించింది. శుక్రవారం పోలీస్ ఔట్ పోస్ట్‌లో కలపపై వచ్చిన కథనానికి అధికార్లు స్పందించారు. విధి నిర్వహణలో ట్రాఫిక్‌ను నియంత్రించే పోలీసులకు ఎండా వానల నుంచి రక్షణ కల్పించేందుకు ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్‌పోస్ట్‌లో రాబోయే సంక్రాంతికి భోగి పండుగ నిమిత్తం కలపను భద్రపరిచారు. ఔట్‌పోస్ట్ కాస్తా కలప డిపోగా మారిపో యిన వైనంపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు పోలీసులు తక్షణం స్పం దించారు. కలపను తొలగించి పోలీస్ ఔట్‌పోస్ట్‌ను యథాస్థానానికి తీసుకువచ్చారు.

## గేమ్‌ఛేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్ ఆహ్వాన కమిటీ ఛైర్మన్‌గా రామకృష్ణ

ఉండ్రాజవరం, జనవరి 03 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో శనివారం జరిగే గేమ్ ఛేంజర్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఆహ్వాన కమిటీ ఛైర్మన్‌గా తనను నియమించినట్టు ఉండ్రాజవరం గ్రామానికి చెందిన ఆలిండియా చిరంజీవి యూత్ వైస్ ప్రెసిడెంట్ కటకం రామకృష్ణ శుక్రవారం తెలిపారు. రామకృష్ణ చిరంజీవి నిర్వహించే అనేక సేవాకార్యక్రమాలు పాల్గొంటు చిరంజీవి కుటుంబానికి సన్నితంగా ఉంటున్నారు. ఈ సందర్భంగా కటకం రామకృష్ణ మాట్లాడు తూ పెద్ద ఈవెంట్‌కు తనను ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. గేమ్ ఛేంజర్ యూనిట్‌కు, ఆలిండియా చిరంజీవి యూత్ ప్రెసిడెంట్ రమణం స్వామినాయుడుకు రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో నిర్మించిన సినిమాలు, నిర్వహించిన ఈవెంట్లు సూపర్‌హిట్ అయినట్లు రామకృష్ణ చెప్పారు.

# సావిత్రిబాయి జీవితం ప్రతిఒక్కరికి ప్రేరణ


మహిళా ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- తొలి మహిళా ఉపాధ్యాయురాలి జయంతి
- పలుచోట్ల ఘన నివాళులు
- పలువురు మహిళా ఉపాధ్యాయులకు సత్కారం

కొవ్వూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మహిళా విద్య కోసం పాఠశాలను స్థాపించి భర్తతో పాటు పోరాడిన ఘనత సావిత్రిబాయి పూలేకి దక్కుతుందని, ఆమె జీవితం ప్రతిఒక్కరికి ప్రేరణ అని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం పలుచోట్ల నిర్వహించారు. కొవ్వూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల మహిళా ఉపాధ్యాయులు వేదమణి (వేములూరు), జె.ప్రసన్నలక్ష్మి(తోగుమ్మి), జి.వెంకట నాగతులసి(పశివేదల), ఎం.కృష్ణవేణి (పంగిడి), ఉదయభాను (కొవ్వూరు బాలుర జూనియర్ కాలేజీ)లను సత్కరించారు. ఈ సందర్భంగా ముప్పిడి మాట్లాడుతూ సావిత్రిబాయి తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా, సంఘ సంస్కర్త, రచయిత్రిగా మహిళలను చైతన్య పరిచారన్నారు. సమాజ పరివర్తనకు ఆమె నడిచిన మార్గం ఎప్పటికి దిక్సూచి అన్నారు. కార్యక్రమంలో కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, ఎంఈవో కిషోర్, ఏవీకే రంగారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పెరవలి:** అజ్జరం నెంబర్-1 ప్రాతమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎంఆర్‌వీఎస్ రెడ్డి మాట్లాడుతూ దళిత బహుజన స్త్రీ జనోద్ధరనకు మహిళా విద్యకు తన జీవితం అంకితం చేసిన త్యాగమయి సావిత్రిబాయి పూలే అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కె.కాశీ విశ్వనాథం, ప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నెంబర్-3 ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ భావన మధు, ఉపాధ్యాయుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

**నల్లజర్ల:** దూబచర్లలోని సంఘమిత్ర స్కూల్లో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు మాట్లాడుతూ సావిత్రిబాయి విద్యా రంగంలో మార్గదర్శిగా నిలిచిన గొప్ప మహిళ అని కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయురాలు నరెడ్ల చందనను సత్కరించారు. కార్యక్రమంలో వీరభద్రరావు, చవాకుల పాల్గొన్నారు.

**గోపాలపురం:** మండలంలోని భీమోలు మండల పరిషత్ ప్రత్యేక పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయురాలిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సతీష్, సీఆర్పీ కొయ్యా నాగరాజు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.


నల్లజర్లలో టీచర్‌ను సత్కరిస్తున్న దృశ్యం


గోపాలపురంలో టీచర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

## కుసుమకు సావిత్రిబాయి పూలే అవార్డు


సినీ నటి రేణుదేశాయ్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న కుసుమ

ఉండ్రాజవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం మండలం కాల్ధరి నెం.3 పాఠశాల ఉపాధ్యాయురాలు పి.కుసుమ శుక్రవారం సావిత్రిబాయి పూలే స్మారక అవార్డు పొందారు. సావిత్రిబాయి జయంతి సందర్భంగా విజయవాడలో జరిగిన భారత చైతన్య యువజన వేడుకల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ మహిళా ఉపాధ్యాయులకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కాల్ధరిలో నెం.3 పాఠశాల ఉపాధ్యాయురాలు కుసుమ ప్రముఖ సినీ నటి రేణుదేశాయ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కుసుమ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రయోగాత్మకంగా విద్యను బోధించేందుకు అనేక రకాల బోధనోపకరణాలు ప్రత్యేకంగా తయారు చేసి, విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభతరంగా అర్థమయ్యే విధంగా బోధిస్తున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి ఐదుగురు ఎంపిక కాగా, వారిలో తాను ఉండడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

# ప్రాణం తీసిన అతివేగం


రాజానగరంలోని ఘటనా స్థలంలో మృతుడు భరత్‌చంద్ర

- హైవేపై లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా ప్రమాదం
- యువకుడి మృతి.. మరో యువకుడికి స్వల్ప గాయాలు

రాజానగరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై లారీని బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు ఓవర్‌టేక్ చేస్తుండగా ప్రమాదం జరిగి ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. హైవేపై గైట్ కళాశాల సమీపంలో శుక్రవారం ఉదయం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రాజమహేంద్రవరం రూరల్ మండ లం తొర్రేడు గ్రామానికి చెందిన మంగం భరత్‌చంద్ర(20), గొల్లపల్లి నాగేంద్ర స్నేహితులు. పెయింటింగ్ పనులు చేస్తుంటారు. కాకినాడలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భరత్‌చంద్ర బంధువు అయిన కృష్ణబాబుకు సీరియస్‌గా ఉందని సమాచారం రావడంతో గురువారం రాత్రి మోటార్‌సైకిల్‌పై కాకినాడ వెళ్లారు. రాత్రికి అక్కడే ఉండి శుక్రవారం ఉదయం తిరిగి తొర్రేడు పయనమయ్యారు. మార్గమధ్యలో గైట్ కళాశాల వద్దకు వచ్చే సరికి హైవేపై ముందు వెళ్తున్న లారీని అధిగమిస్తున్న తరుణంలో మోటార్‌సైకిల్ హ్యాండిల్ లారీకి తగలడంతో అదుపుతప్పి బైక్ నడుపుతున్న భరత్‌చంద్ర అదే లారీ కిందపడి పడి అక్కడికక్కడే మరణించాడు. నాగేంద్ర స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కేవీ నాగార్జున తెలిపారు.

# ఆగి ఉన్న లారీని ఢీకొని ఫిజియోథెరపిస్ట్ మృతి

- మరొకరికి తీవ్రగాయాలు
- కాకినాడ జిల్లా పెనుగుదురులోని కళాశాలకు వెళ్తుండగా పులగుర్త వద్ద ఘటన

అనపర్తి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం పులగుర్త వద్ద మండపేట-రామచంద్రపురం కెనాల్ రోడ్డులో గురువారం అర్ధరాత్రి దాటాక జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనుగుదురులో నిమ్స్ కళాశాలలో ఫిజియోథెరపీ విద్యనభ్యసిస్తున్న ఇరువురు విద్యార్థుల్లో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రగాయాల పాలయ్యారు. ఏఎస్ఐ దుర్గాప్రసాద్ వివరాల ప్రకారం.. తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామానికి చెందిన పుచ్చకాయల నవనీత్(22), ద్వారకా తిరుమల మండలం కమరి గ్రామానికి చెందిన మానుకొండ చందు కాకినాడ జిల్లా పెనుగుదురు గ్రామంలోని నిమ్స్ ఫిజియోథెరపీ కళాశాలలో చదువుకుంటూ అదే కళాశాలలోని హాస్టల్‌లో ఉంటున్నారు. ఇద్దరూ బైక్‌పై కళాశాలకు వెళ్తుండగా పులగుర్త గ్రామం వచ్చే సరికి రోడ్డు పక్కన ఆగి ఉన్న ఖమ్మం నుంచి కాకినాడ వెళ్లే కంటెయినర్‌ను వెనుక నుంచి ఢీకొన్నారు. తీవ్రగాయాలపాలైన ఇద్దరినీ స్థానికులు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే నవనీత్ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. చందుకు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

**ప్రక్కిలంకలో విషాద ఛాయలు**


పుచ్చకాయల నవనీత్ (ఫైల్)

తాళ్లపూడి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం పులగుర్త వద్ద జరిగిన ప్రమాదంలో ప్రక్కిలంక గ్రామానికి చెందిన పుచ్చకాయల నవనీత్ మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నవనీత్ కాకినాడ సంధ్య కళాశాలలో బీఎస్సీ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. తండ్రి బాల మురళీకృష్ణ ప్రక్కిలంక పైడి ఐటీఐ కళాశాలలో ప్రిన్సి పాల్‌గా చేస్తుండగా తల్లి భారతి మండలంలోని గజ్జరం గ్రామంలో సచివాలయ మహిళా పోలీస్‌గా పనిచేస్తున్నారు. సోదరుడు స్నేహిత్ రాజమహేంద్రవం గైట్ కళాశాలలో బీఎస్సీ (ఫోరెన్సిక్) ఫైనలియర్ చదువుతున్నాడు. అన్నద మ్ములిద్దరూ కవలలు. నవనీత్ మృతితో ఆ ప్రాంతమంతా విషాదం అలుముకుంది. నిన్న ఇంటి వద్ద ఉన్న కుమారుడు నేడు విగత జీవి అవ్వడంతో ఆ తల్లి రోదనలు మిన్నంటాయి.